తొలివార్త

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

తెలుగు దిన పత్రిక

www.epaper.tolivaartha.com

ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 178 మంగళవారం 03 - 11 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial

Best Deal HEALTH & WEALTH

"అవకాశాలను సృష్టించడం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించడం."

We create opportunities | 9640707117 (What's up only)

హైదరాబాద్‌ను పరిశుభ్రంగా..

ట్రాఫిక్ ఫ్రీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదు సీఎం ఆదేశం
- ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు
- గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటి సరఫరా విస్తరణ
- సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు



తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 02 :

హైదరాబాద్‌ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భాగ్యనగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని అధికారులను ఆదేశించారు.హైదరాబాద్‌ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భాగ్యనగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరగాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి సోమవారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థాల తరలింపులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటి సరఫరాను విస్తరించాలని సూచించారు. నిర్మాణ పనులు, పార్కులు, గ్రీనరీ నిర్వహణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరాను పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. - మిగతా 2 లో

నవంబర్ 11 నుంచి

కేటీఆర్ బస్సు యాత్ర



- 29న భారీ బహిరంగ సభ
- కేటీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ బస్సు యాత్రకు సన్నాహాలు
- మేడిగడ్డ నుంచి గోదావరి బేసిన్ వరకు యాత్ర
- రైతుల సాగునీటి కష్టాలను ఎండగట్టడమే లక్ష్యం

తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 02 :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బస్సుయాత్రకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. నవంబర్ 11 నుంచి 14వ తేదీ మధ్య రెండు రోజుల పాటు కేటీఆర్ బస్సు యాత్ర చేపడతారని తెలిపారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర, గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా సాగుతుందని వివరించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని - మిగతా 2 లో



తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ

- మంత్రి శ్రీధర్ బాబు
- అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో శిక్షణ కార్యక్రమం
- టాస్క్ ఆధ్వర్యంలో 643 కళాశాలల్లో కోర్సుల నిర్వహణ
- ఇంజినీరింగ్‌తో పాటు ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులకూ అవకాశం
- శిక్షణ పూర్తిచేసిన అర్హులకు ప్రత్యేక జాబ్ మేళాలు
- అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాల కల్పనే లక్ష్యం

తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 02 :

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ అందించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 'తెలంగాణ ఏఐ - మిగతా 2 లో

ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో

భారీగా తగ్గిన ఓటర్ల సంఖ్య

- ఎస్ఐఆర్ ఎఫెక్ట్ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో భారీగా తగ్గిన ఓటర్ల సంఖ్య
- వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గింది
- ఎస్ఐఆర్ నిర్వహించిన తర్వాతే భారీగా ఓట్లు తగ్గడం గమనార్హం



తొలివార్త,ఢిల్లీ, నవంబర్ 02 :

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గింది. సర్ పూర్తయిన తర్వాత ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్, మణిపుర్ రాష్ట్రాల్లో ఓటర్ల సంఖ్య గరిష్ఠంగా 13.24 శాతం మేర తగ్గినట్లు ఈసీ తెలిపింది. సర్‌కు ముందు ఈ ఐదు రాష్ట్రాల్లో కలిపి 18.71 కోట్లు ఓటర్లు - మిగతా 2 లో

త్రివర్ణ పతాకంతో హైదరాబాద్‌లో

అమిత్ షా పాదయాత్ర



- 'ఇండియా' కూటమికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా మహా పాదయాత్ర
- 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' నినాదంతో బీజేపీ ర్యాలీ
- బషీర్‌బాగ్ నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు 1.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర
- పాదయాత్రకు ముందు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమిత్ షా ప్రత్యేక పూజలు
- కాంగ్రెస్ తీరుపై సోషల్ మీడియా వేదికగా అమిత్ షా తీవ్ర విమర్శలు

తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 02 :

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో మహా పాదయాత్ర చేపట్టారు. 'ఇండియా' కూటమి చేపట్టిన ప్రచారాన్ని తిప్పికొట్టే లక్ష్యంతో బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ పాదయాత్ర సాగింది. 'ప్రజాస్వామ్యాన్ని - మిగతా 2 లో

'పుర'పోరు కౌంటింగ్‌కు

ఏర్పాట్లు పూర్తి

- నేడు ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు
- రాష్ట్రంలో పురపోరు కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి
- మంగళవారం జరగనున్న లెక్కింపు కోసం కేంద్రాల్లో టేబుల్స్‌తోపాటు ఇతర ఏర్పాట్లు చేశారు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు



తొలివార్త,అమరావతి, నవంబర్ 02 :

రాష్ట్రంలో పురపోరు కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి.నేడు లెక్కింపు కోసం కేంద్రాల్లో టేబుల్స్‌తోపాటు ఇతర ఏర్పాట్లు చేశారు. నామినేషన్లతోపాటు పోలింగ్ రోజున జరిగిన చిన్నచిన్న ఘర్షణలను దృష్టిలో పెట్టుకుని పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం కానుంది. 13 కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగరపంచాయతీలకు సంబంధించిన ఓట్ల లెక్కింపునకు ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. - మిగతా 2 లో

'మురసు'ను సమర్థంగా ఎదుర్కొందాం

- అధికార యంత్రాంగానికి సీఎం దిశానిర్దేశం
- 'మురసు' తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని, తుపాను వర్షాలను నీటి వనరుల పెంపునకు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- మురసు తుపాను సహాయచర్యలపై సీఎం చంద్రబాబు సమీక్ష



తొలివార్త,అమరావతి, నవంబర్ 02 :

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను 'మురసు' తీవ్ర తుపానుగా బలపడి తీరం వైపు దూసుకొస్తోంది. గత 6 గంటల్లో గంటకు 22 కి.మీ వేగంతో కదిలినట్లు వాతావరణశాఖ తెలిపింది. తుపాను ప్రభావంతో సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.రాష్ట్రంపై మురసు తుపాను ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మురసు తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని, తుపాను వర్షాలను నీటి వనరుల పెంపునకు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అమరావతిలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ నుంచి అధికారులు, కలెక్టర్లతో తుపాను సన్నద్ధతపై సమీక్షించారు. దక్షిణ కోస్తాంధ్ర నుంచి దిగువ జిల్లాలు, రాయలసీమలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో 30 నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.అర్నబ్ తుపాను విధ్వంసం నుంచి చాలా ప్రాంతాలు - మిగతా 2 లో

రాప్తాడు ఘటన నిందితుడు

హేమంత్‌కు తీవ్ర గాయాలు



- కుడి కాలు తొలగించే అవకాశం!
- కుడి కాలుకు రక్త సరఫరా తగ్గడంతో తొలగించే అవకాశం ఉందన్న వైద్యులు
- వైద్యుల పర్యవేక్షణలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు
- పోలీసులపై రాళ్ల దాడి చేయడంతో కాల్పులు జరిపిన వైనం

తొలివార్త,అమరావతి, నవంబర్ 02 :

రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై దాడికి పాల్పడి, పోలీసుల కాల్పుల్లో గాయపడిన నిందితుడు హేమంత్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు కీలక వివరాలు వెల్లడించారు. అతడి కుడి కాలును తొలగించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం హేమంత్ అనంతపురం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ.. నిందితుడు హేమంత్ కుడి కాలుకు రక్త సరఫరా బాగా తగ్గిపోయిందని తెలిపారు. దీనివల్ల కాలులోని - మిగతా 2 లో



రాప్తాడు బాధితురాలిని

జగన్ పరామర్శ

- బెంగళూరు ఆసుపత్రికి జగన్
- రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినిపై ఉన్మాది దాడి
- ఎలక్ట్రిక్ రంపంతో చేసిన దాడిలో తీవ్రంగా గాయపడ్డ బాలిక
- బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో కొనసాగుతున్న చికిత్స

తొలివార్త,అమరావతి, నవంబర్ 02 :

అనంతపురం జిల్లా రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి - మిగతా 2 లో

సంపాదకీయం

ధరల రోగానికి ఇదా చికిత్స?!

నియంత్రించాల్సిన వ్యవస్థలు నోరుమూసుకుంటే, పర్యవేక్షణ చేయాల్సిన ప్రభుత్వం పట్టనట్టుంటే జరిగేదేమిటో ప్రాణాంతక కేన్సర్ వ్యాధికి వాడే ఔషధాల ధరలు చుక్కలనంటడం చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వమూ, జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) ప్రదర్శిస్తున్న అంతులేని నిర్లక్ష్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం మొన్న మంగళవారం తీవ్రంగా దుయ్యబట్టాక ఆ వెంటనేకొంత కదలిక వచ్చిన జాడలు కనబడ్డాయి.అంతక్రితమే సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ సాగుతుండగా ఎంపికచేసిన 137 ఔషధాల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)పై నియంత్రణ విధిస్తూ కేంద్రం ఆదేశాలిచ్చింది. వచ్చే నెల 9నుంచి అమల్లోకొచ్చేలా వీటి ధరలు తగ్గించామని ఉత్పత్తిదారులు ప్రకటించారు. మంచిదే. అయితే మొత్తం 543 కేన్సర్ ఔషధ రకాల్లో వీటి సంఖ్య ఏపాటి? చావు కబురు చల్లగా చెప్పినట్టు పేటెంటు, లైసెన్సు, ఇతర రకాల పరిరక్షణ వ్యవస్థల పరిధిలోకొచ్చే ఔషధాలకు మాత్రం ఈతగ్గింపు వర్తించదంటున్నారు ఉత్పత్తిదారులు.ప్రజలందరి మేలూ కోరే ఆర్థిక వ్యవస్థ లేనిచోట నిరుద్యోగం, పేదరికం, అజ్ఞానం, అనారోగ్యంవంటి సమస్త రుగ్మతలూ ముసురుకుంటాయని కెనడాకు చెందిన ప్రజా వైద్యుడు డాక్టర్ నార్మన్ బెతూన్ చెప్పి దశాబ్దాలు దాటుతోంది. దాదాపు అన్ని ప్రభుత్వాలూ తమ ఆచరణ ద్వారా ఆయన చెప్పింది నూరుశాతం నిజమని నిరూపి స్తున్నాయి. ఉదాహరణకు ఊపిరితిత్తులతోపాటు పలు ఇతర కేన్సర్లకు వాడే మెర్క్‌కంపెనీ ఔషధం వంద మిల్లీగ్రాముల టీకా ధర రూ. 2.16 లక్షలు. ఇంత ధర వెచ్చించటం సాధారణ రోగులకు సాధ్యమేనా? 21 మాత్రలుగా ఉండే ఇమ్యూనోథెరపీ ఔషధం200 మిల్లీగ్రాముల ధర రూ. 24,435. ఈ రెండు రకాల ఔషధాలూ జాబితాలో లేవు.ఇవేకాదు... రూ. 10 లక్షల ఖరీదుచేసే మరో ఔషధం కూడా జాబితాలో గల్లంతయింది! అలాగే చాలావాటి ధరలు స్వల్పంగా... అంటే రూ. 100లోపే తగ్గాయి. రొమ్ము, ప్రోస్టేట్ తదితర కేన్సర్లకు వినియోగించే నాలుగైదు రకాల ఔషధాలు మాత్రం గణనీయంగా తగ్గాయి. ఉదాహరణకు కీమోథెరపీలో వాడే ఔషధం ధర రూ. 80,071 నుంచి రూ. 7,150కి, రొమ్ము కేన్సర్‌కు వాడే ఔషధం ధర రూ. 40,421 నుంచి రూ. 2,720కి, బహుళ కేన్సర్లకు వాడే ఔషధం ధర రూ. 69,852 నుంచి రూ. 13,512కు తగ్గాయి.అసలు ఎంఆర్‌పీపై నియంత్రణ సరిపోతుందనుకోవటమే లోపభూయిష్టం.తగ్గించామని ఘనంగా చెప్పుకున్నంతసేపు పట్టదు అవి పెరగటానికి. ముడి సరుకుల ధరలు పెరిగితే అవి పైపైకి పోతాయి. చాలా రకాల ఔషధాలకు లక్షల రూపాయల ధర పెట్టడం వెనక అవి ప్రాణరక్షణకు ప్రభావవంతంగా తోడ్పడటంతప్ప మరేవిధమైన హేతుబద్ధతా లేదు. ఉత్పత్తిదారుల దగ్గర ధరను నియంత్రిస్తే వేరు. ఉదాహరణకు ఒక ఔషధ తయారీకయ్యే వ్యయానికి ఉత్పత్తిదారులు 42.8 శాతం అదనంగా వేసుకుని స్టాకిస్టులకు విక్రయిస్తారు. రోగులకెళ్లేలోగా మరిన్ని అంచెలుంటాయి. కొన్ని సందర్భాల్లో ఆస్పత్రులే నేరుగా కొని విక్రయిస్తాయి. ఈ క్రమంలో ప్రతిచోటా అదనపు లాభం వేసుకుంటూపోతారు. ఎంఆర్‌పీపై కేంద్రీకరిస్తే ఈ లాభార్జన స్వల్పంగా తగ్గుతుంది. ఆస్పత్రులైతే మందులపై 'కోల్పోయిన' దాన్ని గది అద్దె పెంచటంద్వారానో, మరో రకంగానో వసూలు చేస్తాయి.గతంతో పోలిస్తే కేన్సర్ మహమ్మారి విస్తృతి పెరిగింది. గ్రామాలు, నగరాలన్న తేడా లేకుండా అందరినీ కాటేస్తోంది. కారణాలు అందరికీ తెలుసు. సాగులో ఎరువులవాడకం, అధిక పాల ఉత్పత్తి కోసం పశువులకు విచక్షణారహితంగా ఇంజెక్షన్లివ్వటం, వాతావరణ కాలుష్యం, నదులు, భూగర్భ జలాల కాలుష్యం, ప్రమాదకరమైన ఆహార విక్రయాలు... ఇవన్నీ కేన్సర్ కారకాలు. సారాంశంలో ప్రభుత్వ విధానాలు కావొచ్చు... వాటి నిర్ద్వ్యయపకత కావొచ్చు... ఈ ప్రాణాంతక వ్యాధికి మూలం. ప్రత్యక్షంగాలేదా పరోక్షంగా తామే ఈ మరణమృదంగానికి కారణమవుతూ... కనీసం ఔషధాల ధరలైనా సరిగా నియంత్రించలేనప్పుడు ప్రభుత్వాలుండి ఏం ప్రయోజనం? అందుకేకంటితుడుపు చర్యలు మానుకుని వాస్తవంగా జనానికి లబ్ధి చేకూరే విధానాలు అమల్లోకి తీసుకురావాలి.

రాప్తాడు బాధితురాలిని జగన్ పరామర్శ

మొదటిపేజీ తరువాయి - విద్యార్థినిని వైసీపీ అధినేత జగన్ పరామర్శించారు. బాధితురాలు ప్రస్తుతం బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిస్థితి, ఆమెకు అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం, బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అక్టోబర్ 31న రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదిలోనే బాధితురాలిపై ఓ ఉన్మాది (రంపపు మిషన్)తో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దారుణ ఘటనలో బాలిక తీవ్రంగా గాయపడింది. మెరుగైన చికిత్స కోసం ఆమెను బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.

రాప్తాడు ఘటన నిందితుడు హేమంత్‌కు తీవ్ర గాయాలు

మొదటిపేజీ తరువాయి - కొంత భాగాన్ని తొలగించాల్సి రావొచ్చని ఆమె పేర్కొన్నారు. రక్త ప్రసరణ ఎందుకు తగ్గిందో ఆపరేషన్ సమయంలోనే స్పష్టత వస్తుందని, ఒకవేళ రక్త సరఫరా పునరుద్ధరణ కాకపోతే కండరాలు పూర్తిగా దెబ్బతింటాయని వివరించారు.కాగా, బాలికపై దాడి అనంతరం పరారైన హేమంత్ కోసం 15 పోలీసు బృందాలు గాలించాయి. ఆత్మకూరు అటవీ ప్రాంతంలో అతడిని గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా, నిందితుడు పోలీసులపై రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారు. ఈ ఘటనలో హేమంత్ రెండు కాళ్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

హైదరాబాద్‌ను పరిశుభ్రంగా.. ట్రాఫిక్ ఫ్రీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి - మరోవైపు, నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పక్కా ప్రణాళికలతో ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సు యాత్ర

మొదటిపేజీ తరువాయి - పరిశీలిస్తూ, రైతుల ఇబ్బందులను ఆధారాలతో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు.మరోవైపు, తెలంగాణ ఉద్యమంలో చారిత్రక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29న భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు గంగుల తెలిపారు. 2009లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన అలుగునూరు లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో ఈ సభను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సభకు సుమారు 50 వేల మంది ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో భారీగా తగ్గిన ఓటర్ల సంఖ్య

మొదటిపేజీ తరువాయి - ఉండగా సర్ తర్వాత 16.43 కోట్ల ఓటర్లకు పడిపోయింది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే ఏకంగా 90 శాతం మంది ఓటర్లు తగ్గడం గమనార్హం. యూపీలో 15.44 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య ఫైనల్ రోల్ నాటికి 13.40 కోట్లకు చేరింది. మిగిలిపోయిన ఓటర్లకు, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రస్తుతం జరుగుతున్న సర్ ప్రక్రియ ద్వారా మరో అవకాశం లభించనున్నట్లు ఈసీ తెలిపింది.

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ

మొదటిపేజీ తరువాయి - అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి, కళాశాలలకు, విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేదని.. రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లో శిక్షణ అందిస్తామని వెల్లడించారు.విద్యార్థులకు ఏఐ, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐలో శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులకూ ప్రత్యేక కోర్సులను అందుబాటులో ఉంటాయన్నారు. తద్వారా ఏడాది పాటు 900కు పైగా డిజిటల్ కోర్సులను విద్యార్థులు ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్లోబల్ సర్టిఫికేషన్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిస్కౌంట్ వోచర్లు అందిస్తామన్నారు. విద్యార్థులకు హ్యాకథాన్లు, ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అర్హులకు ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. కళాశాల అధ్యాపకులకూ ప్రపంచస్థాయి ఏఐ, క్లౌడ్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. లక్ష మంది యువతకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నైపుణ్యాలను అందించడమే లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

'మురసు'ను సమర్థంగా ఎదుర్కొందాం



మొదటిపేజీ తరువాయి - సాధారణ స్థితికి వచ్చాయని, మురసు ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని సీఎం స్పష్టం చేశారు. తుపాను గాలులతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో 8 వేల వరకు విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మరోవైపు గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాలతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ పరిధిలోని చెరువులు, రిజర్వాయర్లను సమర్థ నీటి నిర్వహణతో నింపాలని చంద్రబాబు ఆదేశించారు.మురసు తుపాను నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమీక్షించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని పవన్ అన్నారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.అత్యంత భారీ వర్షాల హెచ్చరికలు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వాగులు, వంకల సమీపంలో జన సంచారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను వీలైనంత త్వరగా పునరుద్ధరించేలా సమన్వయం చేసుకోవాలి పవన్ దిశానిర్దేశం చేశారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ప్రజలకు సూచించారు.మురసు తీవ్ర తుపాను ముప్పు పొంచి ఉన్న వేళ ప్రాణ, ఆస్తి నష్టం నివారణే లక్ష్యంగా యంత్రాంగం 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆమె ఇవాళ, రేపు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో తుపాను తీరం దాటే అవకాశముందని, ఆ సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలున్నాయని ప్రఖర్ జైన్ వివరించారు.దీంతో విద్యుత్ లైన్లపై పడే చెట్లను ముందుగానే తొలగించాలని, విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్ అంతరాయాలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అనిత ఆదేశించారు. మత్స్యకారులు బోట్లు, వలలను సురక్షితంగా ఉంచుకునేలా అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ తుపాను గమనాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, అధికారిక హెచ్చరికలు పాటించాలని, వదంతులు నమ్మవద్దని స్పష్టం చేశారు. తుపాను సమస్యల పరిష్కారానికి మనమిత్ర వాట్సప్ 9552300009తో పాటు అత్యవసర సహాయం కోసం 112, 1070, 18004250101 నంబర్లను సంప్రదించాలని హోంమంత్రి సూచించారు.మురసు తుపాను వేళ హోర్డింగులు, భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలే ప్రమాదకరంగా మారకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. తుపాను ప్రభావంపై మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఈదురుగాలులు, వర్షాల కారణంగా రోడ్లపై పడే చెట్లు, విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. డ్రైనేజీలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అమరావతి నుంచి తుపాను ప్రభావాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు.మురసు తుపానుతో వరద ముప్పు పొంచి ఉన్నందున రిజర్వాయర్లపై నిరంతర నిఘా పెట్టాలని, ప్రతి రెండు గంటలకోసారి నీటి ప్రవాహాలను సమీక్షించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. సచివాలయం నుంచి ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి, ఈ సాయంత్రం నెల్లూరు-ఒంగోలు మధ్య తుఫాన్ తీరం దాటనున్న నేపథ్యంలో కృష్ణా, పెన్నా బేసిన్లలో అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, నాగార్జునసాగర్ క్యాచ్‌మెంట్ ప్రాంతంతో పాటు గుండ్లకమ్మ, రాళ్లపాడు రిజర్వా యర్లకు వరద వచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖలు సమన్వయంతో ఫ్లడ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

'పుర'పోరు కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



మొదటిపేజీ తరువాయి - ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత వార్డు, మేయర్ అభ్యర్థులకు సంబంధించిన ఓట్ల కౌంటింగ్ చేపడతారు. ఈసారి మేయర్ స్థానానికి కూడా ప్రత్యక్ష పద్ధతిలోనే ఓటింగ్ నిర్వహించిన నేపథ్యంలో వార్డులతోపాటు మేయర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు ఉంటుంది.రాష్ట్రవ్యాప్తంగా 3,942 వార్డులు, డివిజన్లు ఉన్నాయి. వీటిలో కార్పొరేషన్లలో 922, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 3020 డివిజన్లు, వార్డులు ఉన్నాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. సంబంధిత అభ్యర్థితోపాటు ఏజెంట్, చీఫ్? ఎలక్షన్ ఏజెంట్‌లను మాత్రమే లోపలికి అనుమతించనున్నారు. మంగళవారం మధ్యాహ్నానికి కౌంటింగ్ ట్రెండ్స్ వచ్చే అవకాశం ఉంది. రాత్రికి పూర్తి ఫలితాలు వెలువడొచ్చు. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల ద్వారా పరోక్ష పద్ధతిలో నవంబర్ 5, 6 తేదీల్లో డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరగనుంది.ఏలూరులోని వట్లూరులో ఉన్న జ= రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్?లను నగర పాలక సంస్థ అడిషనల్ ఎలక్షన్ అథారిటీ అధికారి భాను ప్రతాప్ పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 5 గంటలకు కేంద్రానికి చేరుకోవాలన్నారు. తొలి విడతలో 31 డివిజన్ల ఫలితాలు, ఆ తర్వాత మరో 31 డివిజన్ల రిజల్ట్స్ వెల్లడిస్తామని తెలిపారు.అనంతపురం జిల్లా తాడిపత్రిలోస్ట్రాంగ్ రూమ్ వద్దపోలీసులు నిరంతరం నిఘా కొనసాగుతోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఐడీ కార్డులు కలిగిన వారిని మాత్రమే అనుమతిస్తామని డీఎస్పీ చంద్రశేఖర్ తెలిపారు.డాక్టర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీకి నిన్న(ఆదివారం) జరిగిన ఎన్నికల్లో పోలయిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ముమ్మిడివరంలోని జీఎంసీ బాలయోగి బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ నదియాదేవి పరిశీలించారు. లెక్కింపు ప్రక్రియ కొనసాగేటప్పుడు ఏ విధమైన ఆటంకాలు, గొడవలు జరగకూడదని పోలీసులకు సూచించారు. ప్రధాన ద్వారాలను మూసివేసి గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ దరియా దేవి ఆదేశించారు.

త్రివర్ణ పతాకంతో హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర



మొదటిపేజీ తరువాయి - కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' అనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహించారు.నగరంలోని బషీర్‌బాగ్‌లో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఈ పాదయాత్ర ప్రారంభమైంది. జాతీయ జెండా చేతబూని అమిత్ షా ముందుకు సాగగా, ఆయనతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర ముజాంజాహీ మార్కెట్ వద్ద ముగియనుంది. అక్కడ జరిగే కార్నర్ మీటింగ్‌లో అమిత్ షా ప్రసంగించనున్నారు. ఢిల్లీలో ఆదివారం 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీలో బీజేపీపై చేసిన విమర్శలకు ఆయన ఇక్కడ దీటైన సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.పాదయాత్రకు ముందు, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని అమిత్ షా సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "వరుస ఓటములతో కుంగిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు అరాచక చర్యలతో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి అయినా సరే అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ కుట్రపూరిత ప్రయత్నాల నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ మహా పాదయాత్రలో పాల్గొంటున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.నగర పర్యటనలో భాగంగా, తొలుత అమిత్ షా చారిత్రక చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర నేపథ్యంలో బషీర్‌బాగ్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, అఫ్జల్‌గంజ్ సహా పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించి, వాహనాలను దారి మళ్లించారు.

ఏపీ తీరం వైపు 'మురసు'.. పోర్టుల్లో పెను ప్రమాద హెచ్చరికలు.. దక్షిణ కోస్తాలో రెడ్ అలర్ట్


మురసు' తుపానుతో కోస్తాంధ్ర అలజడి

నిజాంపట్నం, వాడరేవు పోర్టులకు 10వ నంబర్ ప్రమాద హెచ్చరిక

ఒంగోలు సమీపంలో తీరం దాటనున్న తీవ్ర తుపాను

బాపట్ల సహా పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

రైళ్లు, విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం



బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తుండటంతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. తుపాను తీవ్రతను సూచిస్తూ కోస్తాంధ్రలోని ప్రధాన ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలను జారీ చేశారు. ముఖ్యంగా, బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, వాడరేవు ఓడరేవుల్లో అత్యంత తీవ్రతను సూచించే 10వ నంబర్ ప్రమాద హెచ్చరికను ప్రదర్శించారు. అదేవిధంగా, మచిలీపట్నం పోర్టులో 9వ నంబర్, కృష్ణపట్నం పోర్టులో 8వ నంబర్ సిగ్నల్స్ జారీ చేశారు. విశాఖపట్నం, భీమునిపట్నం, గంగవరం, కాకినాడ, కళింగపట్నం ఓడరేవుల్లో 3వ నంబర్ హెచ్చరికలను కొనసాగిస్తున్నారు.గత 6 గంటలుగా ఈ తుపాను గంటకు 10 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. సోమవారం మధ్యాహ్నం నాటికి ఇది నెల్లూరుకు 100 కి.మీ, కావలికి 120 కి.మీ, ఒంగోలుకు 160 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, సోమవారం (నవంబర్ 2) అర్ధరాత్రి నుంచి మంగళవారం (నవంబర్ 3) తెల్లవారుజాము మధ్యలో నెల్లూరు-నరసాపురం మధ్య ఒంగోలు సమీపంలో ఈ తీవ్ర తుపాను తీరం దాటే అవకాశం ఉంది. ముఖ్యంగా, ఒంగోలుకు దక్షిణం వైపున ఇది తీరం దాటుతుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 120 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. బాపట్ల జిల్లాలో మంగళవారం (నవంబర్ 3) పాఠశాలలు, కళాశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. సూర్యలంక బీచ్‌ను మూసివేసి, పర్యాటకులు, స్థానికులు ఎవరూ అటువైపు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఇదే తరహాలో ఎన్టీఆర్, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లోనూ విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చారు. సహాయక చర్యల కోసం బాపట్లలో 9281413774, గుంటూరులో 9440827526 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.తుపాను ప్రభావంతో పలు రైళ్లు, విమాన సర్వీసులు రద్దయ్యాయి. ముఖ్యంగా విజయవాడ-గూడూరు, తెనాలి-రేపల్లె మార్గాల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. విజయవాడ, భోగాపురం విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించాల్సిన అనేక విమాన సర్వీసులను కూడా నిలిపివేశారు. కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు, లోతట్టు ప్రాంతాలు 1 నుంచి 1.5 మీటర్ల మేర ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించారు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
తెలుగు దిన పత్రిక
www.epaper.tolivaartha.com
మంగళవారం 03 - 11 - 2026

చౌటుప్పల్‌లో గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ బస్సు

పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావుకు మద్దతుగా జనసేన ఇంటింటి ప్రచారం





చౌటుప్పల్, నవంబర్ 02 (తొలివార్త): ఉమ్మడి ఖమ్మం,వరంగల్,నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడల శ్రీనివాసరావుకు మద్దతుగా చౌటుప్పల్ పట్టణంలో జనసేన పార్టీ నాయకులు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఇటీవల ప్రారంభించబడిన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్ బస్సు ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకులు ఆముదాల పరమేశ్‌ల ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన,ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా చౌటుప్పల్ పట్టణంలో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు.

ఆముదాల పరమేశ్ మాట్లాడుతూ:

"భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం మనకు నేర్పిన గొప్ప విలువ సేవాభావం.భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన కర్మ సిద్ధాంతం ప్రకారం ఫలితాన్ని ఆశించకుండా మన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలి.ఆధ్యాత్మికత అనేది కేవలం పూజలు,ప్రార్థనలకే పరిమితం కాకూడదు.మన ఆలోచనల్లో నిజాయితీ,మన మాటల్లో నిబద్ధత,మన చేతల్లో సేవాభావం ఉన్నప్పుడే నిజమైన ధార్మిక జీవనానికి అర్థం ఉంటుంది.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం కూడా ఒక సామాజిక ధర్మం.నవంబర్ 6వ తేదీ వరకు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు గడువు ఉన్నందున,ఇప్పటివరకు నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలి.అవసరమైన ధ్రువపత్రాలను మాకు అందజేస్తే ఓటరు నమోదు ప్రక్రియలో మా వంతు సహాయ సహకారాలు అందిస్తాం" అని తెలిపారు.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి పట్టభద్రుడి భాగస్వామ్యం ముఖ్యమని,జనసేన అభ్యర్థి గడల శ్రీనివాసరావుకు మద్దతు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీక ప్రవీణ్ కుమార్,పెద్దగొని లింగస్వామి,బద్రి రాజు,కళ్లెట్ల రాజు,పల్చం శ్రీకాంత్,పాశం శ్రీనాథ్, శివ,శ్రీకాంత్,సరికొండ సంజయ్,తేజ,రమణ బాబు,జన సైనికులు పాల్గొన్నారు.

NH-65పై ఘోర రోడ్డు ప్రమాదం..

ఇద్దరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు

లిఫ్ట్ అడిగి ప్రయాణిస్తున్న మహిళ దుర్మరణం.. ప్రమాదంలో మరో వ్యక్తి మృతి





నవంబర్ 02 (తొలివార్త): నకిరేకల్ నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారి ఎన్‌హెచ్-65పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అటిపాముల గ్రామ శివారులోని చెరువు అన్నారం ఎక్స్‌రోడ్డు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడు జొన్నలగడ్డ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వాసు, జొన్నలగడ్డ ప్రశాంత్ ఇద్దరూ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో గోగుల స్వాతి అనే మహిళ లిఫ్ట్ అడగడంతో ఆమెను తమ ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ప్రయాణం కొనసాగించినట్లు సమాచారం. ముగ్గురూ ఒకే ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ అటిపాముల గ్రామ శివారులోని చెరువు అన్నారం ఎక్స్‌రోడ్డు వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి వారి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన గోగుల స్వాతి, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వాసు అక్కడికక్కడే మృతిచెందారు. ద్విచక్ర వాహనంపై ఉన్న జొన్నలగడ్డ ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న సీఐ రాజశేఖర్, ఎస్సై క్రాంతి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో మృతుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, ఇతర వివరాలపై విచారణ కొనసాగిస్తున్నారు...



ఫోటో రైటర్ : మృతులు గోగుల స్వాతి, పల్నాడు జిల్లాకి చెందిన వ్యక్తి జొన్నలగడ్డ వాసు

విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల, కళాశాలల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కొడారి వెంకటేష్



యాదాద్రి భువనగిరి, నవంబర్ 02 (తొలివార్త): యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల పనివేళలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపి విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక నాయకుడు కొడారి వెంకటేష్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్.ఆర్. కళాశాల విద్యార్థులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొడారి వెంకటేష్ మాట్లాడుతూ.. గతంలో యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరే బస్సు సైదాపూర్, మాసాయిపేట, గౌరాయపల్లి, రఘునాథపురం, కాచారం, కంతంగూడెం మీదుగా ఆలేరుకు ఉదయం 9 గంటలలోపు చేరుకునేదని తెలిపారు. దీంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో చేరుకునేవారని పేర్కొన్నారు. అయితే యాదగిరిగుట్ట డిపో అధికారులు బస్సుల సమయాలను మార్చడంతో ప్రస్తుతం ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరుతోందని, దీంతో విద్యార్థులు విద్యాసంస్థలకు సమయానికి చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై డిపో మేనేజర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేదని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి వెంటనే స్పందించారని, ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి పాఠశాలలు, కళాశాలల సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చినట్లు వెంకటేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కే. హారిక, ఐ. చరిత, ఆర్. వాణి, ఎస్. శ్రీవాణి, ఎస్. సోనీ, బి. ప్రవల్లిక, జి. ఈక్షిత, కే. సాత్విక, బి. రిషిక తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నూతన బ్రిడ్జిపై

లోడ్ టెస్టింగ్ వాహనాల రాకపోకలు పాత బ్రిడ్జిపైకి మళ్లింపు

భద్రాచలం సీఐ సట్ల రాజు



భద్రాద్రి జిల్లా నవంబర్ 02 (తొలివార్త): భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మించిన నూతన హై లెవల్ బ్రిడ్జిపై 1.10.2026 నుండి 07.11.2026 వరకు లోడ్ టెస్టింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో, ఈ కాలంలో నూతన బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదు.అని సీఐ సట్ల రాజు తెలిపారు. కావున, ఈ తేదీలలో నూతన బ్రిడ్జి మీదుగా, వాహనదారులు, రాకపోకలు సాగించే అన్ని వాహనాలను, ప్రక్కనున్న పాత బ్రిడ్జి మీదుగా మళ్లించడం జరుగుతుంది. అని,తెలిపారు. వాహనదారులు, ప్రజలు పోలీసు వారి సూచనలను పాటించాలని, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు శాఖకు సహకరించాలని భద్రాచలం ఎస్ హెచ్ ఓ, విజ్ఞప్తి చేస్తున్నారు.స్టేషన్ హౌస్ ఆఫీసర్,భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ సట్ల రాజు విజ్ఞప్తి చేశారు.

బియ్యం కృత్రిమ కొరతను అరికట్టి ప్రభుత్వమే సన్న బియ్యం విక్రయించాలి

ధరల నియంత్రణ కమిటీ, ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేయాలి

వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్



యాదాద్రి భువనగిరి, నవంబర్ 02 (తొలివార్త): యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితులను ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారులు నిత్యావసర వస్తువులు, బియ్యం విషయంలో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సాత్విక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. జిల్లాలో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు వెంటనే జిల్లా స్థాయిలో ధరల నియంత్రణ కమిటీతో పాటు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రతి మున్సిపల్ కేంద్రం, మండల కేంద్రం, రైతు బజార్లలో ప్రభుత్వ ఆధ్వర్యంలో సన్న బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఆధార్ కార్డుపై 10 కిలోల సన్న బియ్యాన్ని కిలో రూ.38 చొప్పున విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి రెండు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి ధరల నియంత్రణ కమిటీ, ఆహార సలహా సంఘాల సమావేశాలను నిర్వహించి నిత్యావసర వస్తువుల ధరలు, బియ్యం సరఫరా, మార్కెట్ పరిస్థితులపై సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షుడు పోచం సోమయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి యాదయ్య, డీసీఐసీ కన్వీనర్ కొడారి వెంకటేష్, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు ఆవుల సురేందర్, ఎలిమినేటి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 6 చివరి తేదీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు ఫారం18 ద్వారా నమోదు చేసుకోండి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు పిలుపు



భద్రాద్రి జిల్లా నవంబర్ 02 (తొలివార్త): అశ్వాపురం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఓరుగంటి వీరయ్య భవన్ నందు విలేకరులతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు మాట్లాడుతూ,ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరు గ్రాడ్యుయేట్ 1- 11-2026 నాటికి, కనీసం మూడు సంవత్సరాలు క్రితం అంటే 1-11-2023 లేదా అంతకంటే ముందు డిగ్రీ/ అర్హత, కలిగి పొంది ఉండాలి సంబంధిత నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసం ఉండాలని తప్పనిసరిగా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు, ఫారం 18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని, ఓరుగంటి రమేష్ బాబు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకు నేందుకు అర్హులైన గ్రాడ్యుయేటర్లు, ఈ నెల నవంబరు 6 చివరి తేదీ కాబట్టి ఇంకా 4 రోజులు సమయం మాత్రమే ఉంది కావున సంబంధిత గ్రాడ్యుయేట్లు, అర్హులైన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఓరుగంటి రమేష్ బాబు కోరారు. ఎన్నికల ప్రక్రియలో పట్టబద్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు దాన్ని బాధ్యతగా,వినియోగించుకోవాలని, తెలిపారు. ఖమ్మం వరంగల్ నల్గొండ జిల్లాలలో, పట్టభద్రుల ఎన్నికలలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి,గా,పోటీలో నిలబడ్డ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, పట్టభద్రులను, ఓరుగంటి రమేష్ బాబు,కోరారు. అదేవిధంగా,ఉన్నత విద్యను 2023 నవంబర్ నాటికి డిగ్రీ,లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదు ఈ నెల నవంబర్ 6 తేదీ లోగా దరఖాస్తు చేసు కోవాలని ఆయన పేర్కొన్నారు.ఓటర్ ఐడి కార్డు,ఆధార్ కార్డు,డిగ్రీ / గ్రాడ్యుయేషన్ సర్టిఫికే ట్,పాస్పోర్ట్ సైజ్ ఫోటో,మొబైల్ నంబర్ తో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రాడ్యుయేటరల కు, ఫారం 18 అందజేసి వారికి వివరిస్తూ ఈ నెల నవంబర్ 6 తేదీ నాటికి ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకునే విధంగా తెలియజేయాలని పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు మరియు మాజీ ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ గ్రామాలలో తిరుగుతూ గ్రాడ్యుయేటరు,ల కి, వివరించాలని, ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు పిలుపునిచ్చారు.

రైతు గర్జన పేరుతో రాజకీయ డ్రామా కేటీఆర్‌ది పసలేని విమర్శలు

చనాక--కొరాట బ్యారేజ్ అవినీతి ఆరోపణలపై సమాధానం చెప్పాలి

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం:

కాంగ్రెస్ నేతలు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పసుల చంటి



ఆదిలాబాద్ నవంబర్ 02 (తొలివార్త): రైతు గర్జన పేరుతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన కార్యక్రమం రైతుల సమస్యల పరిష్కారం కోసం కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం నిర్వహించిన కార్యక్రమమని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పసుల చంటి విమర్శించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల తీరుపై మండిపడ్డారు.

చనాక--కొరాట బ్యారేజ్‌పై సమాధానం చెప్పాలి

చనాక--కొరాట బ్యారేజ్ నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ కేటీఆర్ సోదరి కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలపై సమాధానం చెప్పకుండా, ఇతరులపై రాజకీయ విమర్శలు చేయడం సరికాదని బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. తొలుత రూ.350 కోట్లుగా అంచనా వేసిన ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.1,800 కోట్లకు చేరినా, ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా సాగునీరు అందించలేని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్--నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్, డ్రైపోర్టు ఏర్పాటుపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఇండస్ట్రియల్ కారిడార్ వంటి కీలక ప్రాజెక్టులపై ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు.

రైతుల పంట కొనుగోలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

రాష్ట్రంపై అప్పుల భారం ఉన్నప్పటికీ రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను ఆయన తప్పుబట్టారు. బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూనే రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో చర్చిస్తూ, అభివృద్ధి పనులకు నిధులు సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని, బోర్లలో నీరు ఉన్న రైతులు సాగు చేసుకోవచ్చని, ప్రాజెక్టుల కింద సాగునీటిని వినియోగించుకునే రైతులు డిసెంబర్ 31లోపు మూడో తడి అందేలా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారని వివరించారు. ఈ అంశంపై కేటీఆర్ రైతులను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

పదేళ్ల పాలనలో జిల్లాను నిర్లక్ష్యం చేశారు

అనంతరం జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల చంటి మాట్లాడుతూ కేటీఆర్ ఆదిలాబాద్‌కు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కాకుండా, రాజకీయంగా తమ పార్టీ నాయకులను ప్రోత్సహించేందుకు, బలప్రదర్శన చేసేందుకు వచ్చినట్లు ఉందని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. కడెం ప్రాజెక్టును సమర్థంగా కాపాడలేకపోవడంతో పాటు కుప్టి, చిక్మన్ వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. జిల్లాకు ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టుల కంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు రాజకీయ ప్రచారంలో అధిక ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్ల ప్రాంతాలకే అభివృద్ధిని పరిమితం చేసి, ఆదిలాబాద్ జిల్లాను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రైతు కుటుంబాలకు ప్రభుత్వం అండగా లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని పసుల చంటి ఖండించారు. రైతు బీమా పథకం ద్వారా అర్హులైన రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. యూరియా సరఫరా, యాప్ విధానం విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధ్యురాలిగా చూపడం సరికాదన్నారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల కారణంగా పంటలపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో తెలంగాణలో మాత్రమే కరువు పరిస్థితులు ఉన్నట్లు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేయడం తగదన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో కరువు మండలాల ప్రకటనతో పాటు రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, రాష్ట్ర ప్రయోజనాల సాధన విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని హితవు పలికారు.

రైతు సమస్యల పరిష్కారమే నిజమైన గర్జన

రైతుల సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే గత పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటో, చనాక--కొరాట బ్యారేజ్ ద్వారా ఒక్క ఎకరానికైనా సాగునీరు ఎందుకు అందించలేకపోయారో కేటీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని బాలూరి గోవర్ధన్ రెడ్డి, పసుల చంటి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలకు పరిష్కారాలు చూపించడమే నిజమైన రైతు గర్జన అని, కేవలం రాజకీయ ప్రసంగాలతో ప్రజల చప్పట్లు పొందడం కాదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరు

ఈ సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కీజర్ పాషా, జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జి బెజ్జంకి అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, గోనెల స్వామి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుగత్, వార్డు అధ్యక్షులు సంతోష్, ఫహీం, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి ఆదిల్, రాజా రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారిగడ్డ 20వ వార్డులో స్వచ్ఛతకు నడుం బిగించిన కౌన్సిలర్

తడి-పొడి చెత్త బుట్టలు,మొక్కల పంపిణీ

షాదీఖానా చైర్మన్,కో-ఆప్షన్ సభ్యుల ఆధ్వర్యంలో

పర్యావరణ అవగాహన కార్యక్రమం





చౌటుప్పల్, నవంబర్ 02 (తొలివార్త): స్వచ్ఛ చౌటుప్పల్-పచ్చని చౌటుప్పల్ లక్ష్యంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ 20వ వార్డు బంగారిగడ్డలో విస్తృత అవగాహన,పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.వార్డు కౌన్సిలర్ ఎండి హన్ను బాయ్,కో-ఆప్షన్ సభ్యులు ఎండి బాబా షరీఫ్ మరియు షాదీ ఖానా చైర్మన్ ఎండి కరీం ల ఆధ్వర్యంలో సోమవారం ప్రతి ఇంటికి తడి చెత్త,పొడి చెత్త బుట్టలు మరియు మొక్కలను పంపిణీ చేశారు.

కార్యక్రమ వివరాలు:

20వ వార్డు బంగారుగడ్డలోని ప్రతి గల్లీలో తిరుగుతూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.చెత్తను రోడ్లపై వేయకుండా,తడి చెత్తను వేరుగా,పొడి చెత్తను వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు.ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికి రెండు రకాల చెత్త బుట్టలను అందజేశారు.అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు.ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఒక మొక్కను నాటి సంరక్షించాలని,దీని ద్వారా వార్డును హరిత వార్డుగా మార్చాలని పిలుపునిచ్చారు.

కౌన్సిలర్ ఎండి హన్నుబాయ్ మాట్లాడుతూ:

"మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యం.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మన వార్డును క్లీన్ అండ్ గ్రీన్ వార్డుగా తీర్చిదిద్దుతాం.తడి-పొడి చెత్త వేరు చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ సులభమవుతుంది.రోగాలు రాకుండా ఉంటాయి.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి" అని అన్నారు.

బాబా షరీఫ్ మాట్లాడుతూ:

"20వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం.ప్రజలందరూ సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని కోరారు.ఈ కార్యక్రమానికి వార్డు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై హర్షం వ్యక్తం చేశారు.కౌన్సిలర్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో 20వ వార్డు అధ్యక్షులు ఉడుగు వెంకటేశం గౌడ్,షాదిఖానా మాజీ చైర్మన్ ఎండి.ఎజాస్ పాష,రఫీ,మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్ మరియు కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ రోడ్డు లో పరిసర ప్రాంతాలలో శుభ్రం చేయించిన

మణుగూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు





భద్రాద్రి జిల్లా నవంబర్ 02 (తొలివార్త): పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎస్టి కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు చేపల మార్కెట్ ఏరియాలో పర్యటించిన మణుగూరు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అక్కడి సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లిన నాయకులకు అక్కడ డ్రైనేజీ వ్యవస్థ కొంత అపరిశుభ్రంగా ఉందని గమనించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్ స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ రావు ఫోన్ చేసి వారి దృష్టికి తీసుకువెళ్లగా కమిషనర్, సోమవారం ఉదయం చేపల మార్కెట్ ప్రాంతానికి మున్సిపాలిటీ సిబ్బందితో వచ్చి అక్కడ కాలువలను జేసీబీ తో పూడిక తీపించి పిచ్చి చెట్లను తొలగించి కాలువలో నీటిని సాఫీగా పోయేలాగా శుభ్రం చేసిన మున్సిపాలిటీ సిబ్బంది ఈ కార్యక్రమంలో,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, తో పాటు మైనార్టీ మండల అధ్యక్షుడు రహీంపాషా, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పొడుతూరి రవి,పట్టణ కాంగ్రెస్ నాయకులు, చింతల కృష్ణ, రాజమల్ల ప్రసాద్, ,ఘంటసాల శ్రీను కొర్లకుంట అప్పారావు,చప్పిడి రామసుబ్రహ్మణ్యం, పోడుతూరి నానాజీ, మరియు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శివసత్తు హత్య కేసును 3 గంటలలో చేదించినచౌటుప్పల్ పోలీసులు

సుధాకర్ ను హత్య చేసి 1.73 కోట్ల సొత్తుతో పరారైన దుండగులు

యాదాద్రి ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశాలతో చాకచక్యంగా నిందితుల అరెస్ట్

నిర్మల్ టోల్ వద్ద చిక్కిన ఎంపీ ముఠా





చౌటుప్పల్, నవంబర్ 02 (తొలివార్త): చౌటుప్పల్ లో సంచలనం సృష్టించిన శివసత్తు రాళ్లబండి సుధాకర్ హత్య కేసును చౌటుప్పల్ పోలీసులు కేవలం 3 గంటల్లోనే ఛేదించారు.దేవుడి పూజలు,కొలుపులు చేస్తూ జీవనం సాగించే వృద్ధ పూజారిని దారుణంగా హత్య చేసి,కోట్ల విలువైన బంగారం,నగదు,కారుతో పరారైన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.ఫిర్యాదుదారుడు గుర్రం సురేష్ (29)తెలిపిన వివరాల ప్రకారం ఘటన ఇలా జరిగింది.మృతుడు రాళ్లబండి సుధాకర్ స్వామి ఆయన తన మేనల్లుడు సురేష్ ను పెంచి పోషించారు.దేవుడి పూజలు,కొలుపులు చేయడం వల్ల భక్తులు ఆయనకు డబ్బు,బంగారు ఆభరణాలను కానుకలుగా ఇచ్చేవారు.తేదీ 31-10-2026 రాత్రి 7:00 గంటలకు ఫిర్యాదుదారుడు భార్యతో కలిసి మేనమామ ఇంటికి వెళ్లి రాత్రి 9:30 వరకు మాట్లాడి వెళ్లిపోయాడు.రాత్రి 11:00 గంటలకు ఫోన్ చేసి పడుకున్నావా? అని అడగగా,ఇప్పుడే పవన్,అతని స్నేహితుడు హర్ష వచ్చారు,వారితో మాట్లాడి పడుకుంటా అని మృతుడు చెప్పాడు.అర్ధరాత్రి 00:38 గంటలకు మృతుడి మొబైల్ నుండి ఫిర్యాదుదారుడికి రెండు వాట్సాప్ వాయిస్ మెసేజ్ లు వచ్చాయి.అనుమానం వచ్చి సీసీ కెమెరాలు చూడగా అవి పనిచేయలేదు.బయటకు వచ్చి చూడగా ఇంటి గేటు,మెష్ డోర్ తెరిచి ఉండి,ముందు పార్క్ చేసిన టాటా సఫారీ కారు కనిపించలేదు.దీంతో 01:36 గంటలకు డయల్ 112 కు సమాచారం ఇచ్చాడు.సంఘటనా స్థలానికి చేరుకున్న చౌటుప్పల్ పోలీసులు ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటం గమనించారు.మొదటి అంతస్తు బెడ్ రూమ్ లో మృతుడు మంచంపై బోర్లా పడి,చేతులు,కాళ్లు చీరలతో కట్టివేయబడి,కుడి మోచేతి వద్ద,వీపుపై కత్తిపోట్లతో రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నాడు.

కేసు నమోదు,దర్యాప్తు:

ఫిర్యాదు మేరకు లిక్రైం.నెం. 609/2026, యు/ఎస్103(1),309(4), 309(6), 305(బి) ఆర్/డబ్యూ 3(5) బిఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు.యాదాద్రి-భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపిఎస్ ఆదేశాల ప్రకారం,చౌటుప్పల్ డిఎస్పి పి.మధుసూదన్ రెడ్డి సూచనలతో,చౌటుప్పల్ సిఐ డి.సతీష్ రెడ్డి,ఎస్ఐ లు కనకటి యాదగిరి,రవీందర్,అజయ్ భార్గవ్ తమ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేశారు.కారు నంబర్,సాంకేతిక ఆధారాలతో ట్రేస్ చేయగా కారు నాగపూర్ హైవే వైపు వెళ్తున్నట్లు గుర్తించి జాతీయ రహదారి-44 పై టోల్ ప్లాజాలను అలర్ట్ చేశారు.దీంతో నిర్మల్ జిల్లా గంజాల్ టోల్ ప్లాజా వద్ద తేదీ 01-11-2026 ఉదయం 04:05 గంటలకు నిర్మల్ జిల్లా పోలీసులు నిందితులను పట్టుకున్నారు.తరువాత వారి ఒప్పుకోలు,స్వాధీన పంచనామా ఆధారంగా అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్ట్,నిర్మల్ నందు హాజరు పరిచి,మెజిస్ట్రేట్ ఉత్తర్వు ప్రకారం సోమవారం చౌటుప్పల్ కోర్టులో హాజరు పరిచారు.

నిందితుల వివరాలు:

ఏ1.పవన్ కుమార్ (21),కులం:సాహు (తెలి),నివాసం గ్రామ్ -సోలోంగ్,గొరబీ ,సింగ్రాలి,మధ్యప్రదేశ్ ,సెల్ నెం.9201116032 ఏ2.హర్ష సంతోష్ పాండే,(24),కులం పండిట్,నివాసం స్వామి చౌక్,ముక్తియారగంజ్ , సత్నా,మధ్య ప్రదేశ్, సెల్ నెం. 9179985741 స్వాధీనం చేసుకున్న సొత్తు-మొత్తం విలువ రూ.1,73,63,300/- బంగారం -మొత్తం 1 కేజీ 319.33 గ్రాములు -విలువ రూ.1,30,00,000/- పెద్ద బంగారు గాజులు 2(222 గ్రాములు),చిన్న గాజులు 4(100 గ్రా), గొలుసు 13 గ్రా, పుస్తెల తాడు 83.63 గ్రా, ఉంగరాలు11 (1504.25 గ్రా రికార్డు ప్రకారం),చెవి దుద్దులు,దండ కడియాలు 185 గ్రా,మామిడి హారం 93.58 గ్రా,నెక్లెస్ 24.67 గ్రా,హారాలు,గుండ్ల హారం 121.62 గ్రా తదితరాలు.

వెండి-మొత్తం 3 కేజీ 600.66 గ్రాములు-విలువ రూ.3,60,000/-

వెండి ఉంగరాలు, బుద్ధ విగ్రహం 13.52 గ్రా,బ్రాస్ లెట్ 152 గ్రా,పట్టీలు 774 గ్రా,కడియాలు, వడ్డాణాలు 397.48 గ్రా,గజ్జెలు,కన్నె 1507.46 గ్రా,పెద్ద గజ్జెలు 1261 గ్రా.

ఆయుధం,మొబైల్స్ - రూ. 1,00,000/-

23 అంగుళాల స్టెయిన్ లెస్ స్టీల్ కత్తి, ఐఫోన్ 12 ప్రో మాక్స్ (ఏ1),రియల్‌మీ12 ప్రో ప్లస్,(ఏ2),ఐఫోన్ 16 ప్రో మాక్స్ (మృతుడిది).

నగదు-రూ. 9,03,300/-

రూ.500 నోట్లు 16 బండిళ్లు మరియు 43 నోట్లు=రూ.8,21,500/-,రూ.200 నోట్లు రూ.58,200/- ,రూ.100 నోట్లురూ.22,500/-, తదితర చిల్లర.

వాహనం:

నల్ల టాటా సఫారీ కారు నెం.టీజీ 30ఏ 5659-విలువ రూ.30,00,000/-

నిందితులపై గత కేసులు: లేవు.

ఈ కేసులో కేవలం 3 గంటల్లోనే నిందితులను సొత్తుతో సహా పట్టుకున్నందుకు డిఎస్పి పి.మధుసూదన్ రెడ్డి,సిఐ డి.సతీష్ రెడ్డి,సిఐ ప్రవీణ్ కుమార్ (సీసీఎస్),ఎస్ఐ లు కనకటి యాదగిరి,రవీందర్, అజయ్ భార్గవ్,హెడ్ కానిస్టేబుళ్లు నరేశ్,నర్సిరెడ్డి,కానిస్టేబుళ్లు ఉపేందర్,జానకి రాములు,శ్రీను, సందీప్,నాగూర్ వలీ,శేఖర్, బరద్వాజ్, వెంకన్న,జంగయ్య, మహేశ్,హోంగార్డులు ఉపేందర్, వెంకటేశ్వర్లు,జంగులు, సైదులు,నాగరాజు మరియు నిర్మల్ జిల్లా పోలీసులను యాదాద్రి-భువనగిరి ఎస్పి అక్షాంశ్ యాదవ్ అభినందించి,రివార్డులు ప్రకటించారు.

పిఆర్సిపై కాలయాపన తగదు టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్.

ఖమ్మం నవంబర్ 02 (తొలివార్త): తెలంగాణ ప్రభుత్వం రెండవ పిఆర్సి అమలుపై విపరీతమైన కాలయాపన చేస్తుందని వెంటనే పిఆర్సి అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బాలభారత పాఠశాల నందు జరిగిన మండల పదమూడో మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పిఆర్సి ఇవ్వకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రఆసంతో ఉన్నారని అసంతృప్తి తొలగాలంటే పి ఆర్ సి ని వెంటనే ప్రకటించటం మినహా ప్రభుత్వం దగ్గర వేరే దారి లేదని తెలియజేశారు. 40 నెలల కాలంగా ఆలస్యమైన పిఆర్సి గతంలో ఎప్పుడు లేదని విమర్శించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మేనమేషాలు లెక్కిస్తుందని ఉద్యోగులు సమాజంలో భాగం అని గ్రహించాలని హితువు పలికారు. ప్రభుత్వం సమస్యల



పరిష్కారంలో ఇదేవిధంగా కాలయాపన చేస్తే వచ్చే ఎన్నికల్లో ఇబ్బంది ఎదుర్కొంటుందని తెలియజేశారు. ప్రభుత్వం తక్షణమే పిఆర్సినే ప్రకటించడంతోపాటు సిపిఎస్ రద్దు చేయటం పెండింగ్లో ఉన్న ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట కాల పట్టిక రూపొందించాలని డిమాండ్ చేశారు. అలాగే టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి ఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో ఉన్న ప్రభుత్వ పాఠశాలను మూసి వేయటం సరికాదని హితువు పలికారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు యూపుల భారం తగ్గించే ఉపాధ్యాయులను బోధనలకు పరిమితం చేయాలని కోరారు. ఈ మహాసభకు షేక్ లాల్ సయ్యద్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి టి శ్రీనివాసరావు హిందూ ప్రియ షేక్ రఫీ ప్రగతి కుమారి, చెన్నారావు మురళీకృష్ణ రాధా వెంకటేశ్వర్లు రామారావు వెంకటేశ్వరరావు కోటేశ్వరరావు రామకృష్ణ స్వామి స్వరాజ్యలక్ష్మి గిరిజ రాణీ పద్మజ సంధ్యారాణి సునీత రామారావు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందుగా ఉద్యమ పథకాలను ఆవిష్కరించారు అనంతరం నూతన కమిటీని ఏకీగ్రవంగ ఎన్నుకున్నారు.

పునీత సిసిలియమ్మ దేవాలయంలో ఘనంగా సకల ఆత్మల పండగ.

తనికెళ్ల విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ అగస్టీన్.

కొనిజర్ల నవంబర్ 02 (తొలివార్త): తనికెళ్ళ గ్రామంలోని పునీత సిసిరియమ్మ దేవాలయంలో ఉత్తన ఆత్మల పండగ భక్తిశ్రద్ధలతో తనికెళ్ల విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ అగస్టీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన సమస్త విశ్వాసుల కోసం ప్రత్యేక ప్రార్థనలు దివ్య పూజావలి నిర్వహించారు. మరణించిన ఆత్మల శాంతి కోసం ప్రత్యేకంగా ప్రార్థిస్తూ వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో విచారణ గురువులు, సిస్టర్స్ సంఘ పెద్దలు ఉపదేషలు మరియదల సభ్యులు విచారణలోని విశ్వాసులందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫాదర్ అగస్టీన్ ప్రార్థిస్తూ మరణించిన వారి ఆత్మల కోసం ప్రార్థించటం జీవించిన ఉన్నవారు విశ్వాసం ప్రేమ సేవా భావంతో జీవించడం క్రైస్తవ జీవితంలో ఎంతో ముఖ్యమని ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. అనంతరం సమిష్టి



ప్రార్థనలతో కార్యక్రమం ముగిసింది. ఈ మండల ద్వారా విశ్వాసులు అందరిలో ప్రార్థనా భావం ఆధ్యాత్మిక చింతన పరస్పర ప్రేమాభిమానాలు మరింత బలపడ్డాయి. మరణించిన వారి ప్రేమతో స్మరించుకుంటూ వారి ఆత్మలకు నిత్య విశ్రాంతి కలుగజేయాలని ప్రార్థించారు. ఈ లోకంలో మరణించినటువంటి క్రైస్తవ బిడ్డలు మరియు క్రైస్తవేతరులు ఎంతోమంది మరణించి ఉంటారని వారందరి ఆత్మలో దేవుని సన్నిధానంలో చేరాలని ప్రత్యేకంగా



ప్రార్థించారు. ఈ లోకంలో మనిషి జీవించినప్పుడు తను చేసిన తప్పులను ఆ ప్రభువైన ఏసుక్రీస్తు క్షమించాలని ఈ లోకంలో ఉన్నటువంటి మనుషులందరూ కూడా ప్రార్థించాలని ఆ విధంగా మరణించినట్లయితే చనిపోయిన ఆత్మల కోసం ప్రత్యేకంగా ప్రార్థించి మరి ఆత్మలకు నిత్య విశ్రాంతిని కలుగజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ అగస్టీన్, సెయింట్ అలోసిస్ సిస్టర్స్, సంఘ పెద్దలు మరియదల సభ్యులు సంఘ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ప్రజాకవి సుద్దాల జానకమ్మ హనుమంతు చరిత్రను ప్రభుత్వము పాఠ్యపుస్తకాలో చేర్చాలని.

ఐ ఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్

ప్రభుత్వానికి విజ్ఞప్తి.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 02 (తొలివార్త):ప్రతి నిధి. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ప్రజాకవి సుద్దాల జానకమ్మ హనుమంతు చరిత్రను ప్రభుత్వము పాఠ్యపుస్తకాలో చేర్చాలని ఐ ఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి ప్రజాకవి సుద్దాల జానకమ్మ హనుమంతు జాతీయ 20 26 అవార్డు అందుకున్న వామపక్ష ఉద్యమ నేత కార్మిక నాయకుడు గూడ ఐలయ్య గౌడ్ కి జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని కార్మికులు ఐ ఎన్ టి యు సి కుత్బుల్లాపూర్ నియోజక వర్గం అధ్యక్షులు కృష్ణ గౌడ్ హెచ్ఎంటి కార్మిక సంఘం నాయకులు అధ్యక్షతన సూరారం ఐ ఎన్ టి యు సి కార్యాలయం లో ఘనంగా సన్మానం జరిగినది ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కార్మిక ఉద్యమ నేత గత 40 సంవత్సరాలుగా నిరంతరం కార్మికుల పేదల పక్షాన నిటారుగా నిలబడి పోరాడిన కాంగ్రెస్ నాయకులు ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య గౌడ్ ని గుర్తించినందుకు సుద్దాల ఫౌండేషన్ చైర్మన్ సినీ గే రచయిత రాష్ట్రపతి అవార్డు అశోకు



తేజకు కార్మికుల పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం ఉద్యమకారులను గుర్తించిన సుద్దాల ఫౌండేషన్ చాలా గొప్పదని తెలంగాణ రాష్ట్ర ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ అన్నారు ప్రజా ఉద్యమ నేత కార్మిక నాయకుడు ప్రజా నాయకుడు సమ సమాజ స్థాపన పోరాటంలో మార్పు కోసమే నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిటారుగా నిలబడి కార్మికుల పక్షాన నిలబడి పోరాడి జైలు జీవితం గడిపిన గూడ ఐలయ్య గౌడు గొప్ప వ్యక్తికి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తన కలాన్ని గలాన్ని తూటాలుగా మార్చి ప్రజా చైతన్యం కల్పించిన సుద్దాల హనుమంతు అవార్డుతో ఐలయ్య గౌడుకు బాధ్యత పెరిగిందని వారి స్ఫూర్తితో కార్మిక వర్గానికి సేవ చేయాలని అన్నారు నాటి తెలంగాణలో నైజాం ప్రభుత్వంలో ప్రజా పాలన రావాలని కలలుగన్న ప్రజా కవి సుద్దాల హనుమంతు స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగిస్తున్నారని అన్నారు ప్రజా పాలనలో కవులను కళాకారులను తెలంగాణ సంస్కృతిని ప్రపంచాన్ని చాటి చెప్పడానికి ప్రోత్సహిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి జాతీయ కార్యదర్శి డాక్టర్ బుధాల అమర్ బాబు కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ గ్రేటర్ హైదరాబాద్ ఐఎన్టీయూసీ అధ్యక్షులు చాంద్ పాషా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఐఎన్టీయూసీ అధ్యక్షులు కృష్ణ గౌడ్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బాబురావు రాష్ట్ర మీసేవ అధ్యక్షులు జాన్సర్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వివిధ కంపెనీల నుండి వచ్చిన ఐ ఎన్ టి యు సి మహిళా నాయకులు అచ్చమ్మ సీతమ్మ రమ్య వాణి సువర్ణ వరలక్ష్మి తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

కొనిజర్ల మండల కేంద్రంలో పలు కుటుంబాల పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్.

బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పోట్ల శ్రీనివాసరావు.

కొనిజర్ల నవంబర్ 02 (తొలివార్త): కొనిజర్ల మండలంలోని తీగల బంజర మంగాపురం గ్రామాలలో ఇటీవల మరణించిన దొడ్డపనేని లక్ష్మీబాయి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తాత మధుసూదన్ రావు పరామర్శించారు. అలాగే మోతుకూరు వెంకటేశ్వరరావు మాజీ ఎంపీటీసీ భార్య విజయలక్ష్మి అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి ఆయన నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్ నాయకులు తాళ్లూరి జీవన్ పోట్ల శ్రీనివాసరావు చీకటి రాంబాబు, పోగుల శ్రీనివాస్ పాపగంటి శ్రీనివాస్ అనుములు శ్రీనివాస్ దొడ్డపనేని రామారావు జట్ల శ్రీనివాస్ దావా విజయకుమార్ అనుమల శ్రీనివాసరావు వీరభద్రరావు చింతలబోయిన రంగా ఆడబ శంకర్రావు వడ్లమూడి సైదా బాబు అనుములు మురళి తదితరులు పాల్గొన్నారు.

పెదననేమిల గౌడ సంఘం

అధ్యక్షుని గా భాషనపల్లి మల్లయ్య ఎన్నిక..



నూతనకల్. నవంబర్ 02 (తొలివార్త): మండల పరిధిలోని పెదనేమిల గ్రామ గౌడ సంఘం అధ్యక్షునిగా భాషనపల్లి మల్లయ్య ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భాషనపల్లి మల్లయ్య మాట్లాడుతూ నాపై నమ్మకం నుంచి నన్ను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు గౌడ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసి గౌడ సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. నూతన గౌడ సంఘ అధ్యక్షుని ఎన్నుకోబడిన మల్లయ్యను స్థానిక సర్పంచ్ చురుకంటి లావణ్య మధుసూదన్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో గౌడ కుల నాయకులు గడ్డమీది వెంకటేశం,గొడిశాల రాజమల్లు, సాయిలు,గుండగాని వెంకన్న, రమేష్,గుర్రం వెంకన్న,దూసరి అబ్బయ్య,మొలుగూరి మల్లయ్య,వెంకన్న,రేసు రామస్వామి,భాషలపల్లి యాదగిరి,వెంకన్న,వీరస్వామి, తొనుకునూరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో టిపిసిసి అధ్యక్షుని కలిసిన బొమ్మక్ కళ్యాణ్






మేడిపల్లి, నవంబర్ 02 (తొలివార్త): ఢిల్లీలో నిర్వహించిన 'వోట్ చోరీ' నిరసన కార్యక్రమం అనంతరం తెలంగాణ భవన్‌లో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, సంస్థాగత అభివృద్ధి, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్ఠం చేయడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులడు శివ చరణ్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్, మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్ షా మహాపాదయాత్రకు

మల్లాపూర్ నుంచి భారీగా తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

బిముత్యం రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



నవంబర్ 02 (తొలివార్త):నవతెలంగాణ బి నాచారం : కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న మహాపాదయాత్రకు మల్లాపూర్ ప్రాంతం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో భారీగా జన సమీకరణ చేపట్టి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా పాదయాత్రకు మద్దతుగా నినాదాలు చేస్తూ కార్యక్రమంలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమంలో ముత్యం రెడ్డి, దొడ్డి యాదగిరి, కేశవరం యాదగిరి చారి, గోపు రాజేష్, పటేల్ అపర్ణ గౌడ్, సబిత యాదవ్, తిరుపతిరెడ్డి, శశికాంత్ పటేల్, గణేష్, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, రాజేష్ యాదవ్, అశోక్ శర్మ, శ్యామ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీఎస్ఎస్ తనికెళ్ల పాఠశాలలో బోరు ప్రారంభోత్సవం.

తుళ్లూరు చిన్న సత్యం జ్ఞాపకార్థం.



కొనిజర్ల నవంబర్ 02 (తొలివార్త): తనికెళ్ళ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో నీటి కొరత ఉన్న కారణంగా అవసరాన్ని గుర్తించి తుళ్లూరి రమేష్ ఆయన తండ్రి జ్ఞాపకార్థం లక్ష రూపాయల ఖర్చుతో బోరుబావిని వేయించారు. ఆ బోరు బావిని ఈరోజు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్రహం అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లకావత్ దర్గా ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు వార్డు సభ్యులు బెజవాడ రాంబాబు సిపిఐ పార్టీ కొనిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కరరావు పూర్వ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి లేడిపోయిన గోపాలరావు రిటైర్డ్ ఉపాధ్యాయులకే విష్ణుమూర్తి, రిటైర్డ్ టీచర్ ఏ పుల్లయ్య వెంపటి రమణ ఉపాధ్యాయులు పిల్లలు గ్రామస్తులు పాల్గొని ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఇంతటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన తుళ్లూరు రమేష్ ఆయన సతీమణికి వారి బావా అక్కకు పాఠశాల సిబ్బంది క్రమపెద్దలు అభినందనలు తెలియజేశారు. తుళ్లూరు చిన్న సత్యం గ్రామ అభివృద్ధి కోసం పార్టీ అభివృద్ధి కోసం తనకిచ్చిన పనిని నియమ నిబంధనలను తో పనులను చేయించడంలో ముందు స్థానంలో ఉన్నారని కొనియాడారు. ఏది ఏమైనా మంచి సమయంలో పిల్లలకు మంచినీటి అవసరాల కోసం నీటి సదుపాయాన్ని కల్పించిన తుళ్లూరు రమేష్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

చెరువులను నీటితో నింపాలి..

అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో

డి--16, 17, 19, 22, 25 కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలి





గుర్రంపోడు నవంబర్ 02 (తొలివార్త): గుర్రంపోడు మండలంలోని ఎండిపోతున్న చెరువులను డి--16, 17, 19, 22, 25 కాలువల ద్వారా తక్షణమే నీటితో నింపాలని డిమాండ్ చేస్తూ సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చెరువుల్లో నీరు లేక భూగర్భ జలాలు పడిపోతున్నాయని, పశువులు, ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎమ్మార్పీ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి మండలంలోని అన్ని చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎల్బీసీ ఏఈ చంద్రప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పిల్లి ఉమారాణి--అభినయ్, మేకల రమా--సత్యనారాయణ, వెలగపూడి రాంబాబురావు, కామళ్ల రాములు, టంగుటూరి సురేష్, కొండ నరేష్, పామనుగుండ్ల వెంకన్న గౌడ్, జంగాల చంద్రయ్య, బొమ్మ బాలకృష్ణ, వడ్డేగోని గంగాధర్ గౌడ్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

RNI : TGTEL/25/A0357
ప్రజా గళం మా కలం.....
www.tolivaartha.com
www.epaper.tolivaartha.com

వార్డు సభ్యుల సమస్యలు పరిష్కరించాలి

వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి వార్డు మెంబర్ల ఫోరం



గుర్రంపోడు నవంబర్ 02 (తొలివార్త): వార్డు సభ్యుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, గ్రామాల్లో వార్డుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ గుర్రంపోడు ఎంపీడీవో, ఎంపీఓలకు సోమవారం మండల వార్డు మెంబర్ల ఫోరం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. వార్డు సభ్యులకు నెలకు రూ.3 వేల గౌరవ వేతనం, కుటుంబాలకు హెల్త్ కార్డులు, ప్రమాద బీమా కింద రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా కల్పించాలని, అభివృద్ధి పనుల శిలాఫలకాలపై వార్డు సభ్యుల పేర్లు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు రేపాక శివ, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము మహేష్, మహిళా అధ్యక్షురాలు యానక మంగమ్మ, యూత్ అధ్యక్షుడు ఎస్.కె. జహీర్ పాషా, ప్రధాన కార్యదర్శి కూన్‌రెడ్డి యాదయ్యతో పాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణి ని నిర్వహించాలని
సిపిఐ మరియు జనసేన నాయకులు ధర్నా.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 02 (తొలివార్త):ప్రతి నిధి. ప్రతి సోమవారం నాడు కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే ప్రజావాణికి దూరప్రాంతాల నుండి ప్రజలు వెళ్లవలసి రావడం వల్ల వారికి ఇబ్బంది కలగకుండా స్థానిక రెవెన్యూ అధికారి కార్యాలయంలోని ప్రజావాణి నిర్వహించాలని గత మూడు నెలల క్రితం జీవో జారీ చేసినప్పటికీ కు రెవెన్యూ కార్యాలయంలో అధికారికంగా ప్రజావాణి నిర్వహించకపోవడం వల్ల నేడు సిపిఐ మరియు జనసేన పార్టీలో ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.గత వారం మరియు గత నెల క్రితం కూడా ప్రజావాణి నిర్వహించాలని వినితిపత్రం ఇచ్చినప్పటికీ స్పందించకపోవడం వల్లే నేడు ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాల్సి వచ్చిందని, ప్రజావాణి ఉండడం వల్ల ప్రజల తమ సమస్యలను నేరుగా అధికారులను కలిసి ఇచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి ఎంతో కొంత ఆ సమస్య పరిష్కారం అవుతుందని ఆశతో ప్రజలు ఉంటారని కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రజావాణి కార్యక్రమం అనుకున్నంత మేరకు విజయం సాధించలేకపోతుందని దానికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్మమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి అన్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల పైన హైకోర్టు తీర్పునిచ్చి నెలలు గడిచినప్పటికీ నేటికీ చర్యలు తీసుకోకపోవడం అదేవిధంగా జగద్గిరిగుట్ట మరియు గాజులరామారంలో అనేక భూకబ్జాలను కొనసాగుతున్నాయని వాటన్నిటిని పరిష్కరించాల్సిందిగా డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో బైరెడ్డి రాజేష్ కి వినతి పత్రం ఇచ్చి కచ్చితంగా ప్రజావాణి నిర్వహించాలని డిమాండ్ చేయగా వారు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ జనసేన అధికార ప్రతినిధి నల్లగిరి సతీష్ సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మీ శ్రీనివాస్ సిపిఐ నాయకులు కే వెంకటేష్ సదానంద, సహదేవరెడ్డి శ్రీనివాస్ చారి, మల్లేష్, ఇమామ్ యువజన సంఘం నాయకులు కీర్తి ,ప్రవీణ్, నరసింహ, జనసేన నాయకులుదుర్గాప్రసాద్,నవీన్,మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మీ వెంటే ఉంటా...! బాలయ్య నగర్ ను మరింత అభివృద్ధి చేస్తా...!!

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నవంబర్ 02 (తొలివార్త): ప్రతి నిధి. ప్రజా బంధువుకు "బాలయ్య నగర్" బస్తీ వాసుల ఘన స్వాగతం. జై బిఆర్ఎస్...జైజై వివేకన్న నినాదాలతో మార్మోగిన బాలయ్య నగర్.మౌలిక వసతుల కల్పననే లక్ష్యంగా 125 – గాజుల రామారం డివిజన్ బాలయ్య నగర్ లో దాదాపు 47.50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.నిరుపేదలు అధికంగా నివసించే బాలయ్య నగర్ బస్తీ నిలబెట్టేందుకు బస్తీ వ్యవస్థాపకులు ఎల్లయ్య చేసిన త్యాగం మరువలేనిదని, బాలయ్య నగర్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా గత పన్నండేళ్ళ కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్లు, వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో కూడా మౌలిక వసతుల కల్పనతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణము, బతుకమ్మ ఘాట్, ఛత్ పూజ గాట్లను నిర్మించేందుకు మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ.నాగేష్ ఉపాధ్యక్షులు సిఎస్ఐ, ప్రధాన కార్యదర్శి ఈ.పార్వతి శ్యాంసుందర్, గంగయ్య, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీకే సమస్యలపై సంక్షేమ సంఘం సమరశంఖం!

సీఎంసీ కార్యాలయం ఎదుట నిరసన.. డీసీకి వినతిపత్రం



కుత్బుల్లాపూర్నియోజకవర్గం, నవంబర్ 02 (తొలివార్త): ప్రతి నిధి. 17 ఏళ్లుగా తీరని సమస్యలు.. అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్.రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ సంక్షేమ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో సోమవారం చింతల్ సీఎంసీ సర్కిల్ కార్యాలయం ఎదుట కాలనీవాసులతో కలిసి నిరసన చేపట్టింది.డ్రైనేజీ, సీసీ రోడ్లు, మహిళా భవనం, సంక్షేమ సంఘం కార్యాలయం, పార్కుల అభివృద్ధి, విద్యుత్, వీధి దీపాలు, పోలింగ్ బూత్ ఏర్పాటు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. అనంతరం ప్రజావాణిలో డీసీ లక్ష్మీ ప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ధర్మారం అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి మాట్లాడుతూ.. సుమారు 17 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఆర్జీకేలో పదివేల మందికి పైగా నివసిస్తున్నా, జనాభాకు అనుగుణంగా అభివృద్ధి మాత్రం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రత్యేక నిధులు కేటాయించి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.వినతిపై డీసీ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నర్సింహా రెడ్డి, జగదీశ్, బాన్సాడ వెంకటేష్, నాగభూషణం, సంక్షేమ సంఘం నాయకులు, మహిళా సంఘం సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన తాహసిల్దార్ అరుణ.



కొనిజర్ల నవంబర్ 2 తొలి వార్త. కాచారం రెవిన్యూ పరిధిలోని భూ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన కొనిజర్ల తహసిల్దార్ అరుణ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని మండల పరిధిలోని పలు గ్రామాలలో భూ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సర్వే కార్యక్రమంలో ఆ గ్రామ రైతులందరూ కూడా సర్వే చేసే ప్రభుత్వ అధికారులకు సహకరించి తమ తమ గ్రామాలలో ఉన్నటువంటి భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్ సర్వే అధికారి భానోత్ రామచందర్, వీఆర్ఏ కేతమ్మ, స్థానిక గ్రామ రైతులు కనగంటిరావు బైరెడ్డి సత్యనారాయణ కొనకంచి లక్ష్మీనారాయణ మద్దినేని కృష్ణయ్య వీరబాబు రాంబాబు వెంకటేశ్వర్లు నరసయ్య రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ

రాజగోపాల్ రెడ్డి అభివృద్ధిని చూసి ఓర్వలేకనే చౌకబారు విమర్శలు:కాంగ్రెస్ నాయకులు



చౌటుప్పల్,నవంబర్02 (తొలివార్త): చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించేందుకు ఆదివారం వచ్చిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది.ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా చౌకబారు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు.మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సుమారు రూ.1,800 కోట్ల నిధులు కేటాయింపజేయడంతో పాటు,మౌలిక సదుపాయాలు, విద్యా,వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు.ప్రజలకు మెరుగైన విద్యా,వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని,త్వరలోనే 100 పడకల ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించేలా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.గత నెల13న మున్సిపల్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశంలో చర్చించి,ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనల మేరకు తంగడపల్లి రోడ్డుకు యూటర్న్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.ఈ విషయాలన్నీ తెలిసి కూడా రాజకీయ లబ్ధి కోసం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అనవసరమైన విమర్శలు చేస్తున్నారని అన్నారు.మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్య వైద్యం కొరకు తన సొంత నిధులతో వందల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న పేద ప్రజల సంక్షేమ కొరకు కృషి చేస్తున్నారని అన్నారు.ఈ సమావేశంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇప్ప వెంకటేశం,మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సామకూర యాదయ్య,ఉపాధ్యక్షులు అంతటి బాలరాజు,చెరుకు లింగస్వామి, వర్కాల కుమార్ బండమీది మల్లేష్,ఎండి వాహిదుద్దిన్,కార్యదర్శులు గుండెబోయిన ఐలయ్య యాదవ్,ఎండీ ఫరాజ్,మట్టపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి యాగానికి అందరం ఒక్కటవుదాం...

ఆధ్యాత్మిక వైభవానికి బాటలు వేద్దాం.!

వస్తు రూపంలోనైనా..

ధన రూపంలోనైనా మీ సహకారం అందించండి.

ప్రతి విరాళానికి రసీదు, ప్రతి రూపాయికి పారదర్శక లెక్కలు చూపిస్తాం.

యాగం కమిటీ సభ్యులు



భద్రాద్రి జిల్లా బూర్గంపాడు నవంబర్ 2 (తొలివార్త) డిసెంబరు నెలలో జరగబోయే శ్రీ శ్రీ శ్రీ శత రుద్ర సహిత మహా చండీ యాగం నిర్వహణకు మనస్ఫూర్తిగా సంకల్పం చేసుకోవడం జరిగింది. ఈ మహోత్తరమైన కార్యక్రమం లోక కళ్యాణం కోసం, మన గ్రామ సుభిక్షం కోసం, రోగభయ పీడల పరిహారం కోసం నిర్వహించబడుతుంది. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, మన గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ఈ మహాయాగాన్ని నిర్వహించేందుకు సంకల్పించాము. మన గ్రామంలోని ప్రతి ప్రాంతం నుండి కొంతమంది భక్తులు ఈ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుకుంటున్నాము. ఈ మహత్తర కార్యక్రమంలో మీరు కూడా భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము. మీకు వీలైన విధంగా వస్తు రూపంలో గానీ, ధన రూపంలో గానీ సహాయ సహకారాలు అందించి ఈ మహాయాగం విజయవంతం కావడానికి మీ వంతు తోడ్పాటును అందించాలని కోరుకుంటున్నాము.

విరాళాల సేకరణలో పూర్తి పారదర్శకత :

మీరు అందించే ధన రూపేణా లేదా వస్తు రూపేణా విరాళాలకు సంబంధించి కమిటీ సభ్యుల వద్ద నుండి తప్పనిసరిగా రసీదు ఇవ్వడం జరుగుతుంది. ఈ మహత్తర కార్యక్రమం నిమిత్తం సేకరించిన ప్రతి రూపాయిని యాగ నిర్వహణకు మాత్రమే వినియోగిస్తామని, ప్రతి రూపాయికి సంబంధించిన పూర్తి లెక్కలను పారదర్శకంగా తెలియజేస్తామని కమిటీ తరపున హామీ ఇస్తున్నాము. ఇలాంటి మహోత్తరమైన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావడం కూడా పూర్వజన్మ సుకృతమే, యోగదాయకమే కదా. అందరి సహకారంతో, అమ్మవారి ఆశీస్సులతో ఈ మహాయాగాన్ని విజయవంతం చేద్దాం. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై, ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు ముత్తవరపు రాజశేఖర్, దేవులపల్లి సాయి కిరణ్ శర్మ, కళ్యాణ్, రాజు, గోవర్ధన్, బాలు, రవికిరణ్, ప్రమీల, భవానీ, అనిత, ఇందు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎలక్షన్లో బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం..

తెలంగాణకు సాగునీరు అందించకుండా ఆంధ్రకు నీళ్లు తరలించిన కాంగ్రెస్ ప్రభుత్వం..

అన్ని రంగాల ప్రజలను మోసం చేసి గద్దెనెక్కింది కాంగ్రెస్ పార్టీ .. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి .





సూర్యాపేట (హుజుర్ నగర్)నవంబర్ 02తొలి వార్త ఉమ్మడి నల్గొండ -- వరంగల్ -- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథి గా హాజరు అయిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎలక్షన్లో బిఆర్ఎస్ జండా విజయకేతనం ఎగరడం ఖాయం. ఏం మొఖం పెట్టుకొని కాంగ్రెస్ వారు ఓటేయమని అడుగుతారు. జనాల్లోకి వెళ్లలేక ముఖం చాటు వేసిన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరువచ్చింది.కృష్ణమ్మని వాడుకోవడం చేతకాక చంద్రబాబు నియోజకవర్గానికి పంపించిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతోంది కనీసం నీటిపై అవగాహన లేని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి. కాళేశ్వరం ప్రాజెక్టుపై అవాకులు చవాకులు మాట్లాడుతూ అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారని కెసిఆర్ ఉన్నప్పుడు పచ్చగా ఉన్న పల్లె సీమలు నేడు నెర్రెలవాసి, ఆకాశం వైపు చూస్తున్నాయని అన్నారు.. ఇవేం పట్టని కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ చుట్టూ చెక్కర్ల కొడుతున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ పాలన వస్తే మార్పు వస్తుంది అని అందరూ ఏదో గొప్పగా జరుగుతోందని ఆశపడ్డారు కానీ రైతుల జీవితాలు నిరుద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటాడుకుందని అందర్నీ నడిరోడ్డుపై పడేసిందని ఆరోపించారు. హుజూర్నగర్ నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతుందని అందుకు నిదర్శనమే ఇటీవల అధికారుల సస్పెండ్ చేయడమని అన్నారు.పాలనపై చేతకాకుండా ల్యాండ్ స్టాండ్ మెయిన్స్ పై దృష్టి పెడుతున్నారని అన్నారు.

సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి మాట్లాడుతూ..

అసలు కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కే లేదని అత్యధికంగా ఈసారి ఉత్తంకుమార్ రెడ్డి నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ పార్టీకి ఓటు నమోదు అవుతుందని నియోజకవర్గంలోని బిఆర్ఎస్ శ్రేణులను ఎంత ఇబ్బంది పెట్టినా సైనికుల పోరాడుతున్నరు.ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి పెద్ద ఎత్తున నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం బిఆర్ఎస్ పార్టీ విజయమైన అని.కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలు అన్నిటిని తుంగలో తొక్కుకుంటూ తెలంగాణ రైతాంగాన్ని మొత్తాన్ని కూడా ఆగం చేసుకుంటూ వస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపించారు.హుజూర్నగర్ నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతుందని అధికారులను సస్పెండ్ చేసి అందుకు ప్రలోభ పెట్టిన అధికార పార్టీ నాయకుల్ని ఎవర్ని ఏమనకపోవడం వెనక మంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని అన్నారు.

ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు హుజూర్నగర్ ఇన్చార్జి కంచర్ల కృష్ణారెడ్డి,

బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ హుజూర్నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి,పిలుట్ల రఘు, కొప్పుల సైదిరెడ్డి, జక్కుల నాగేశ్వర్రావు, అరిబండి సురేష్, అప్పిరెడ్డి,కడియం వెంకట్ రెడ్డి, అంజిరెడ్డి,చెనబోయిన సైదులు, లింగయ్య యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల్వంచ లో పలు కుటుంబాలను పరామర్శించిన

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



భద్రాద్రి జిల్లా నవంబర్ 2 (తొలి వార్త) పాల్వంచ పట్టణ పరిధిలోని ప్రాంతాల్లో సోమవారం పలు చోట్ల కుటుంబాలను పరామర్శించిన డిసిఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని సంతాపం తెలిపారు.పాత పాల్వంచ నివాసి, ఎన్ఎండీసీ రిటైర్డ్ ఉద్యోగి లోగాని సాయిబాబు ఇటీవల మరణించారు. విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి, పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ డిసిఎంఎస్ జిల్లా చైర్మన్ కొత్వాల, శ్రీనివాసరావు, కొత్వాల, తో పాటు సాయిబాబు సోదరులు లోగాని శ్రీనివాసరావు, లోగాని మురళి, లోగాని సురేష్, లోగాని రామారావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎనుగుల అర్జునరావు, జర్నలిస్టులు తోట శ్రీను, శనగా రామచందర్, జి. శ్రీనివాస్, బూసి శ్రీను తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొదుమూరి శ్రీనివాసరావు సోదరీమణి, వ్యాపారస్థులు సంకా కృష్ణార్జున రావు తల్లి సంకా నాగేశ్వరి, దశదినకర్మల సందర్భంగా కొత్వాల పాల్గొని నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు, చింతలపూడి రాజశేఖర్, కొదుమూరి శ్రీనివాసరావు, బూసి శ్రీను, జి. శ్రీనివాస్,కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాపాదయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న

బిజెపి రాష్ట్ర నాయకులు



భద్రాద్రి జిల్లా నవంబర్ 2 (తొలి వార్త) హైదరాబాద్ లో జరిగిన "ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం, అరాచకవాదాన్ని అంతం చేద్దాం"అని, నినాదంతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పాల్గొన్న"మహా పాదయాత్ర"కార్యక్రమంలో పాల్గొన, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన బిజెపి పార్టీ నాయకులు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోడియం బాలరాజు మహబూబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ముస్కు శ్రీనివాస్ రెడ్డి, మరియు బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం



భద్రాద్రి జిల్లా నవంబర్ 2 (తొలి వార్త) పినపాక నియోజకవర్గం, ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సంక్షేమ కమిటీ ఎస్టి చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, సోమవారం నాడు మణుగూరు మండలంలో పలు ప్రాంతాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా, గ్రాడ్యుయేట్, ఓటరు నమోదు చేసుకునే విధంగా తెలియజేయాలని,మణుగూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రాడ్యుయేట్లు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు,ఈనెల 6 చివరి తేదీ నాటికి, ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుతూ గ్రాడ్యుయేట్లకు ఫారం 18 లను అందజేసి ఓటర్ నమోదుపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు పొందేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, తెలుపుతూ అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పట్టభద్రులను కురం రవి ముదిరాజ్, కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి,పోలమూరి రాజు, ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు పోడుతూరి రవి , చప్పిడి రామసుబ్రహ్మణ్యం , కొర్లకుంట అప్పారావు పోడుతురి నానాజీ,గనిబోయిన,నాగేశ్వరావు, రాజమల్ల ప్రసాద్,ఓదెల రాధిక, ముర్రం లక్ష్మి, తోట మంగ,జేడిదేవి,అక్షిత, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు విమర్శించే హక్కు లేదు!

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌కు ఏం చేశారో చెప్పాలి

కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొమురం కోటేష్



అదిలాబాద్ 02 నవంబర్ (తొలివార్త) ఆదిలాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఇచ్చోడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్ జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో కేటీఆర్ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం, ప్రజల అభ్యున్నతి, జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం కృషి చేస్తుంటే, బీఆర్ఎస్ నాయకులు విమర్శలకే పరిమితమవుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి గురించి మాట్లాడే ముందు గతంలో అధికారంలో ఉన్నప్పుడు జిల్లాకు ఎన్ని నిధులు కేటాయించారు, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు అనే విషయాలను ప్రజలకు స్పష్టం చేయాలని సూచించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అసంపూర్తిగా మిగిలిన అభివృద్ధి పనులపై కేటీఆర్ సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు.జిల్లా ప్రజల సంక్షేమం, రైతుల సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతిపై నిర్మాణాత్మక చర్చ జరగాలని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు. గత పాలనలో చేసిన అభివృద్ధిని వివరించిన తర్వాతే ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేయాలని కేటీఆర్‌కు సూచించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొమురం కోటేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు.

రాప్తాడు ఘటన నిందితుడిపై పోలీసుల కాల్పులు

రాప్తాడు ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బాలికపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే

ఈ క్రమంలో నిందితుడు హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు.



అనంతపురం జిల్లా రాప్తాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన రాక్షసుడు హేమంత్‌పై పోలీసుల బృందం కాల్పులు జరిపింది. తీవ్రంగా గాయపడిన నిందితుడిని పోలీసులు అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యులు శస్త్రచికిత్స చేశారు. నిందితుడి దాడిలో రాప్తాడు సీఐ వెంకటేశ్ ఎడమ భుజం కింది భాగంలో గాయాలయ్యాయి. ఇదే క్రమంలో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ కింద పడిపోవడంతో శరీరంపై పలుచోట్ల గీసుకుపోయింది.చికిత్స పొందుతున్న రాప్తాడు సీఐని ఎస్పీ జగదీశ్ పరామర్శించారు. పోలీసులు పట్టుకునే క్రమంలో నిందితుడు ఇనుప ముక్కతో రాప్తాడు సీఐ వెంకటేశ్‌పై దాడికి యత్నించాడని ఎస్పీ జగదీశ్ తెలిపారు. లొంగిపోవాలని హెచ్చరిస్తూ పోలీసులు మొదట గాల్లో కాల్పులు జరిపారని చెప్పారు. అయినా ఎదురుదాడి చేయడంతో హేమంత్ కాళ్లపై కాల్చారని పేర్కొన్నారు. రెండు మోకాళ్ల కిందిభాగంలో ఆరు బుల్లెట్లు దూసుకెళ్లాయని వివరించారు. నిందితుడి దాడిలో గాయపడిన సీఐ ఆరోగ్యపరిస్థితి ఫర్వాలేదని వెల్లడించారు. నిందితుడి పరిస్థితి విషమంగా ఉందని ఎస్పీ తెలియజేశారు.నిందితుడికి తొలి నుంచే నేర ప్రవృత్తి ఉన్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు మరణించడంతో అక్క వద్ద కొంత కాలం ఉన్నాడు. హేమంత్ ప్రవర్తన నచ్చకపోవడంతో అక్క అతన్ని ఇంట్లో నుంచి పంపేసింది. అప్పటి నుంచీ అనంతపురం శివారులో అద్దె గదిలో ఉంటూ టమోటా మండీలో కూలీగా పనిచేస్తున్నాడు. మద్యం, గంజాయికి పూర్తిగా బానిసైనట్లు సమాచారం. గతంలోనూ రాప్తాడు బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులపై దాడి చేసినట్లు సమాచారం. ఆ తర్వాత కొంత కాలంగా సమీప బంధువైన బాలిక వెంటపడి వేధించినట్లు తెలిసింది. ఈ విషయం బాలిక కుటుంబసభ్యులకు చెప్పింది. ఈ క్రమంలోనే శనివారం పాఠశాల గదిలోకి చొరబడి బాలికపై దాడి చేశాడు.హేమంత్‌పై పోలీసులు ఆదివారం కాల్పులు జరిపిన ఘటనపై బాలిక స్వగ్రామమైన అయ్యవారిపల్లిలో స్థానికులు స్పందించారు. పోలీసులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవడం ఊరటనిచ్చిందని తెలిపారు. బాలికకు న్యాయం జరగాలని, విద్యార్థినుల భద్రతకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.“పోలీసులు పట్టుకునే క్రమంలో నిందితుడు ఇనుప ముక్కతో రాప్తాడు సీఐ వెంకటేశ్‌పై దాడికి యత్నించాడు. లొంగిపోవాలని హెచ్చరిస్తూ పోలీసులు మొదట గాల్లో కాల్పులు జరిపారు. గాయపడ్డ నిందితుడిని అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకువచ్చారు.

క్యూర్ పరిధిలో ఊరిస్తున్న అదృష్టం

కొందరు లబ్ధిదారులు వెనక్కి తగ్గడంతో మళ్లీ లాటరీ తీయనున్న అధికారులు

ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు లాటరీ పద్ధతిన ఎంపికైన వారిలో కొందరు వెనకడుగు వేశారు

దీంతో మొత్తం 16 నియోజకవర్గాల్లో ఈనెల 4న మళ్లీ లాటరీ తీయనున్నారు



సొంతింటి కలను నిజం చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ఇప్పటికే ఎంతో మంది లబ్ధి పొందారు. అయితే ఈ పథకాన్ని క్యూర్ పరిధిలోనూ అమలు చేయాలని నిర్ణయించింది. దానికి అనుగుణంగానే సన్నాహాలు చేశారు. ‘ఇందిరమ్మ ఇళ్ల టవర్స్’ కోసం వేలాది దరఖాస్తులు అందాయి. వీటిని పలు దశల్లో పరిశీలించి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే ఎంపికైన వారిలో కొందరు ఆర్థిక కారణాలు లేదా ఇతర కారణాల వల్ల వెనక్కి తగ్గారు. దాంతో వారి స్థానంలో మరికొందరిని మళ్లీ లాటరీ తీసి ఎంపిక చేయనున్నారు.నిర్మించనున్న ఫ్లాట్ల సంఖ్యకు సరిపడా లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ, డబ్బు చెల్లించే సమయంలో కొందరు తప్పుకున్నారు. మొదటి దశలో ప్రకటించిన 16 నియోజకవర్గాల్లో ఒకటి-రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్నింటిలోనూ మళ్లీ లాటరీ నిర్వహించాల్సి వచ్చింది. నియోజకవర్గంలో నిర్మించనున్న 480 ఫ్లాట్ల కోసం (సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 140 ఫ్లాట్లు) లబ్ధిదారులను ఎంపిక చేశారు.అంతేకాకుండా ప్రతి నియోజకవర్గానికి గరిష్ఠంగా 120 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసి వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచారు. ఇలా చేసినప్పటికీ, అనేక నియోజకవర్గాల్లో ఫ్లాట్ల కోసం ఎంపికైన వారు అనర్హులుగా తేలారు. వెయిటింగ్ లిస్టులో ఉన్నవారిని వారి స్థానంలో చేర్చినప్పటికీ, మొత్తం ఫ్లాట్లకు సరిపడా లబ్ధిదారులు లేరు. దీనివల్ల మళ్లీ లాటరీ నిర్వహించడం అనివార్యమైంది.లాటరీ ప్రక్రియ మొదలైనప్పుడు, ఖైరతాబాద్ నియోజకవర్గంలో మాత్రమే మళ్లీ లాటరీ అవసరమవుతుందని అధికారులు భావించారు. కానీ, దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఒకవేళ దరఖాస్తుదారుడు తప్పు నియోజకవర్గాన్ని ఎంచుకున్నట్లయితే వారు లాటరీలో గెలిచినప్పటికీ వారిని పరిగణనలోకి తీసుకోరు. ఒకవేళ వారు నిజంగానే అర్హులని తేలితే వారు ప్రస్తుతం ఉంటున్న నియోజకవర్గంలో నిర్మిస్తున్న టవర్లలో ప్రాధాన్యత కల్పించాలని హౌసింగ్ బోర్డు యోచిస్తోంది.ప్రస్తుతం ఖైరతాబాద్‌లో లాటరీ ద్వారా కేటాయించాల్సిన ఫ్లాట్లు చాలా ఉన్నట్లు సమాచారం. శేరిలింగంపల్లిలో అన్ని ఫ్లాట్లకు లబ్ధిదారులు ఉన్నప్పటికీ, వారిలో ఒకరు, ఇద్దరు మాత్రమే డబ్బు చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. ఆదివారం రాత్రి వరకు వాయిదాలు (ఇన్‌స్టాల్‌మెంట్లు) చెల్లించిన వారి వివరాలను, ఖాళీగా ఉన్న ఫ్లాట్ల వివరాలను అధికారులు సేకరించారు. దీని ఆధారంగా, 4వ తేదీన ఆన్‌లైన్ ద్వారా లాటరీ నిర్వహించనున్నారు.

త్వరలోనే ఆర్మూర్ టూ మంచిర్యాల 4 లేన్ల రోడ్డు పనులు

ఇక ప్రయాణం సూపర్ ఫాస్ట్!

ఆర్మూర్-మంచిర్యాల నేషనల్ హైవే నాలుగు లేన్ల రోడ్డుగా మారబోతోంది

రాబోయే రెండు నెలల్లోనే ఈ విస్తరణ పనులు మొదలయ్యే అవకాశం ఉంది



జగిత్యాల జిల్లా గుండా వెళ్లే ఆర్మూర్-మంచిర్యాల జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించే పనులు రాబోయే రెండు నెలల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అటవీ శాఖ ఇప్పటికే దీనికి అనుమతి ఇవ్వగా, కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. భూ యజమానులకు అవార్డు ఇవ్వడం కూడా ప్రారంభించారు.తాజాగా నిజామాబాద్-జగ్దల్‌పూర్ జాతీయ రహదారి-63లోని 131.89 కిలోమీటర్ల ఆర్మూర్-మంచిర్యాల సెక్షన్ పరిధి టెండర్‌ను భోపాల్‌కు చెందిన ఒక నిర్మాణ సంస్థ దక్కించుకోవడంతో ఈ ప్రక్రియ వేగవంతం అయ్యే అవకాశం ఉంది. ఒప్పందం కుదిరిన తేదీ నుంచి రెండు నుంచి ఐదు నెలల్లో ఈ పని పూర్తి కావాలి. ప్రణాళిక ప్రకారం అంతా సవ్యంగా జరిగితే, రాబోయే రెండు నెలల్లో రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.2016లో కేంద్ర ప్రభుత్వం ‘భారత్‌మాల పరియోజన ప్రాజెక్టు’ కింద ఈ రహదారి విస్తరణ పనుల కోసం ఒక గ్రీన్‌ఫీల్డ్ అలైన్‌మెంట్‌ను ప్రతిపాదించింది. రాయపట్నం గోదావరి వంతెనకు సమాంతరంగా మరో వంతెనను నిర్మించి, ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి ద్వారా విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించింది. దీనికోసం 2022లో మార్కింగ్ పూర్తి చేశారు. ప్రసిద్ధ ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి, గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు డిజైన్‌ను మార్చారు.కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల పట్టణాలకు ఆనుకుని ఉన్న బైపాస్ రోడ్ల ద్వారా బుగ్గారం మండలంలోని మద్దునూరు, రాయపట్నంలోని గాంధీ మీదుగా రహదారిని మళ్లించారు. గోదావరి వంతెన సమీపం నుంచి ప్రభుత్వ భూమి గుండా మోదెలా మీదుగా గోదావరికి సమాంతరంగా బైపాస్ నిర్మించేందుకు అధికారులు సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టును సిద్ధం చేశారు.

జాతీయ రహదారి విశేషాలు

రహదారి నిర్మాణ శైలి హైబ్రీడ్ యాన్యుటీ మోడల్
తగ్గనున్న ప్రయాణ సమయం 1.30 గంటలు
సేకరించిన భూమి 378 ఎకరాలు
ప్రాజెక్టు వ్యయం రూ.1236.36 కోట్లు
రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది

ప్రస్తుతం ఆర్మూర్-మంచిర్యాల రహదారిపై ఉండే ప్రధాన పట్టణాల్లో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయి. ఈ రద్దీని నివారించడానికి రద్దీగా ఉండే ప్రాంతాలకు బైపాస్ రోడ్లు నిర్మిస్తారు. ఈ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించడం వల్ల నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల మధ్య రవాణా వ్యవస్థ మరింత వేగవంతం సురక్షితం అవుతుంది.

కేబుల్ బ్రిడ్జిపై మరో విషాదం.. దుర్గం చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

హైదరాబాద్‌లోని దుర్గం చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య

మృతుడిని నల్లగండ్లకు చెందిన సాయి మహేశ్వర్‌గా గుర్తింపు

కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడిన యువకుడు

ఆర్థిక సమస్యల వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యుల అనుమానం

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మాదాపూర్ పోలీసులు

హైదరాబాద్‌లోని దుర్గం చెరువులో విషాదం చోటుచేసుకుంది. మాదాపూర్ కేబుల్ బ్రిడ్జి పైనుంచి చెరువులో దూకి 29 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిని నల్లగండ్లలోని మీరో అపార్ట్‌మెంట్స్‌లో నివసించే సాయి మహేశ్వర్‌గా పోలీసులు గుర్తించారు.సాయి మహేశ్వర్ శనివారం మధ్యాహ్నం సమయంలో కేబుల్ బ్రిడ్జిపై నుంచి దుర్గం చెరువులోకి దూకేశాడు. సమాచారం అందుకున్న వెంటనే మాదాపూర్ పోలీసులు, డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. అనంతరం అతని మృతదేహాన్ని వెలికితీశాయి.పోలీసుల వివరాల ప్రకారం.. సాయి మహేశ్వర్ గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. ఆ తర్వాత ఉద్యోగం మానేసి కొంతకాలం మొబైల్ షాపు నడిపాడు. ప్రస్తుతం అతను ఖాళీగా ఉంటున్నట్లు తెలిసింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్యకు గల కచ్చితమైన కారణాలపై విచారణ జరుపుతున్నారు.

ఏపీపై మురసు ఎఫెక్ట్ - పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు

మురసు తుపాను ప్రభావంతో పలు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి

ఈ క్రమంలో రోడ్లపై వాననీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు

మురసు తుపాను ప్రభావంతో ఏపీలో పలు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. తెల్లవారుజాము నుంచే వానతో ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపైకి నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు అర్నబ్ మిగిల్చిన నష్టం నుంచి కోలుకోకముందే మళ్లీ వాన రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేడు నెల్లూరు జిల్లాలోని విద్యాసంస్థలు, విజయనగరం జిల్లాలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అధికారులు ఎప్పటికప్పుడు తుపాను పరిస్థితి అంచనావేస్తూ తగు సూచనలు చేస్తున్నారు.విజయనగరం జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. గంట్యాడ మండలంలో జోరుగా వర్షం పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. డెంకాడ, వేపాడ, చీపురుపల్లి మండలాల్లోనూ చిరుజల్లులు కురుస్తున్నాయి. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విజయనగరం జిల్లాలో పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు తెలిపారు.పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. పార్వతీపురం, కురుపాం, సాలూరు నియోజకవర్గాల్లోనూ తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తీరప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. తుపాను పరిస్థితిపై సబ్ కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేట, జి.సిగడాం, సారవకోట, జలుమూరు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తుపాను నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అచ్చెన్నాయుడు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్, తాగునీరు, వైద్యసేవలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం పడుతోంది. కొయ్యూరు, చింతపల్లి, జీకే వీధి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట మండలాల్లో వాన కురుస్తోంది.కాకినాడ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వానకు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో వర్షపు నీరు నిలిచిపోయింది. శాంతినగర్, సాంబమూర్తి నగర్, పెద్ద మార్కెట్, గుడారిగుంట, సురేష్ నగర్, శశికాంత్ నగర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు నీట మునిగాయి. ప్రత్తిపాడు, కత్తిపాడులో, పిఠాపురంలో వర్షం పడింది.తునిలో భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వానకు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైతు బజారులో వాన నీరు నిలబడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జోరువానలో తడుస్తూనే అరటి వ్యాపారులు వ్యాపారాలు కొనసాగించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, అంబాజీపేట ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా జిల్లాలో చిరుజల్లులు పడుతున్నాయి. రాజమహేంద్రవరం సహా తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, ఉండ్రాజవరం, పెరవలి, రాజానగరంలో గోపాలపురం మండలాల్లో ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. దీంతో ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో వాన నీరు చేరింది. కేంద్రపాలిత ప్రాంతం యానాంలో వర్షం దంచికొడుతోంది. గత వారంలో అర్నబ్ తుపాను ధాటికి యానాం అల్లకల్లోలంగా మారింది. దాని నుంచి తేరుకోక ముందే మళ్లీ వాన కురుస్తోంది.నెల్లూరు జిల్లాలో గాలుల తీవ్రత పెరిగింది. అనేక చోట్ల చిరుజల్లులు కురుస్తున్నాయి. తీర ప్రాంతంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. దుగరాజపట్నం, కొత్తపట్నం, కృష్ణపట్నం, కోడూరు, మైపాడు, ఇసుకపల్లి, తుమ్మలపెంట తీర ప్రాంతాల్లో కెరటాలు ఎగసిపడుతున్నాయి. తుపాను హెచ్చరికతో లెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ క్రమంలోనే నేడు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు.తుపాను తీవ్రతను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సముద్రంలో వేటపై నిషేధాజ్ఞలు ఉన్నాయని ఇప్పటికే వేటకు వెళ్లిన వారు వెంటనే తిరిగి రావాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు సూచించారు. ఈ మేరకు గూడూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అత్యవసర సహాయం కోసం నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లో 0861-2331261, వాట్సాప్ 7995576699 నంబర్లను అందుబాటులో ఉంచారు.విశాఖలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వానకు నేవీ క్వార్టర్స్ ప్రధాన డ్రైనేజీ పొంగిపొర్లింది. శానిటరీ విభాగం అధికారులు పూడికతీత పనులు చేపట్టినప్పటికీ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. డ్రైనేజీలో వ్యర్థాలు వేస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.మరోవైపు మురసు తుపాను నేపథ్యంలో పలు జిల్లాల్లో విద్యుత్‌శాఖ కంట్రోల్ రూమ్ నంబర్లను ఏర్పాటుచేసింది. సహాయం కోసం సంప్రదించాలని సూచించింది. టోల్ ఫ్రీ నంబర్ 1912ను కూడా అందుబాటులో ఉంచింది. ప్రజలు తెగిపడిన విద్యుత్ తీగలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను తాకకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

కంట్రోల్ రూమ్ నంబర్లు :

కృష్ణా- 6281709355, ఎన్టీఆర్- 9440817561, గుంటూరు- 9440817526, బాపట్ల- 9281413774, ప్రకాశం- 9440817491.

రిటైర్డ్ ఐపీఎస్ బాలసుబ్రమణ్యం పార్థివదేహానికి సీఎం చంద్రబాబు నివాళులు

రిటైర్డ్ ఐపీఎస్ బాలసుబ్రమణ్యం పార్థివదేహానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు

ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రిటైర్డ్ ఐపీఎస్ బాలసుబ్రమణ్యం సమర్థతపై తనకు ఎనలేని విశ్వాసం ఉండేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఉన్నప్పుడు చాలా విప్లవాత్మక మార్పులు తెచ్చారని కొనియాడారు. గత కొన్నేళ్లుగా ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలసుబ్రమణ్యం అమెరికాలోని న్యూయార్క్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహానికి సీఎం నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థించారు. బాలసుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రిటైర్డ్ అయ్యాక 2 నెలలకే బాలసుబ్రమణ్యం మనందరికీ దూరం కావడం బాధాకరమని సీఎం అన్నారు.బాలసుబ్రమణ్యం కొన్నిరోజుల క్రితం క్యాన్సర్ బారిన పడటంతో అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స పొందుతున్న సమయంలోనూ పలుమార్లు ఆయనతో మాట్లాడినట్లు సీఎం తెలిపారు. ఒకవైపు చికిత్స తీసుకుంటూ విధులకు కూడా హాజరయ్యారు చంద్రబాబు గుర్తు చేశారు. రాష్ట్ర విభజన సమయంలో బాలసుబ్రమణ్యం ఇంటెలిజెన్స్‌లో ఉన్నారన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా కూడా విభజన సమయంలో జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు చెప్పేవారని వివరించారు. ఆయన సమర్థతమైన నాకు ఎనలేని విశ్వాసం ఉండేదని తెలిపారు. బాలసుబ్రమణ్యంతో తనకున్న అనుభందాన్ని సీఎం చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.సుబ్రమణ్యం ఆర్టీసీలో పని చేసినప్పుడు కూడా అతడిపై ఉన్న నమ్మకంతో ఈ ప్రగతి బాధ్యతలు అప్పగించినట్లు సీఎం చంద్రబాబు వివరించారు. ఆర్టీసీలో ఆయన ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. తాను పని చేసిన ప్రతీ విభాగంలో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చిన వ్యక్తి సుబ్రమణ్యం అని కొనియాడారు. సుబ్రమణ్యం పోలీసు శాఖకు వన్నె తెచ్చిన వ్యక్తి అని సీఎం అన్నారు.‘బాలసుబ్రమణ్యం సమర్థతపై నాకు ఎనలేని విశ్వాసం ఉండేది. మూడు దశాబ్దాలు పోలీసు శాఖలో, ప్రభుత్వ విభాగాల్లో విభిన్న సేవలు అందించారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఉన్నప్పుడు చాలా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అన్ని శాఖలను సమన్వయం కోసం ఈ-ప్రగతి బాధ్యతలు అప్పగించాను. ఆయన ఎంతో నిబద్ధతతో పని చేసేవారు.’.

20 నిమిషాల్లో రూ.52,000 కోట్లు ఆవిరి!

బినాన్స్‌పై చరిత్రలోనే అతిపెద్ద సైబర్ దాడి

నష్టపోయిన ఆస్తుల్లో 95 శాతాన్ని సొంత నిధులతో భర్తీ చేసిన సంస్థ

దాడి వెనుక ఉత్తర కొరియా హ్యాకింగ్ గ్రూప్ ఉన్నట్లు ప్రకటించిన ఎఫ్‌బీఐ

వినియోగదారులకు ఎలాంటి నష్టం లేదని వెల్లడి..

విత్‌డ్రాయల్స్ పునఃప్రారంభం

దొంగిలించిన ఆస్తుల్లో 3 బిలియన్ డాలర్లను ఫ్రీజ్ చేసిన పరిశ్రమ భాగస్వాములు



ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ అయిన బినాన్స్‌పై చరిత్రలోనే అతిపెద్ద సైబర్ దాడి జరిగింది. కేవలం 20 నిమిషాల వ్యవధిలో హ్యాకర్లు సుమారు 6.3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 52,000 కోట్లు) విలువైన క్రిప్టో ఆస్తులను దొంగిలించారు. ఈ భారీ హ్యాకింగ్ ఘటన తర్వాత బినాన్స్ తన సేవలను తిరిగి ప్రారంభించింది. వినియోగదారులకు నష్టం వాటిల్లకుండా చోరీకి గురైన ఆస్తులలో 95 శాతాన్ని తమ సొంత నిధులతో భర్తీ చేసినట్లు ప్రకటించింది.అక్టోబర్ 29న న్యూయార్క్ కాలమానం ప్రకారం, రాత్రి సమయంలో ఈ దాడి జరిగింది. బహుళ బ్లాక్‌చెయిన్‌లలోని హాట్ వాలెట్ల నుంచి హ్యాకర్లు వేగంగా నిధులను ఖాళీ చేశారు. ఈ దాడి వెనుక ఉత్తర కొరియా ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకింగ్ యూనిట్ 'ట్రేడర్‌ట్రైటర్' (లాజరస్ గ్రూప్‌గా కూడా పిలుస్తారు) ఉందని అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఆరోపించింది. ఇదే గ్రూప్ 2025లో బైబిట్ ఎక్స్ఛేంజ్‌పై జరిపిన దాడిలో 1.5 బిలియన్ డాలర్లను దొంగిలించినట్లు గతంలో ఆరోపణలు ఉన్నాయి.బినాన్స్ సహ వ్యవస్థాపకురాలు, కో-సీఈవో యి హే అబుదాబిలోని తన నివాసంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' చూస్తుండగా ఈ విషయం తెలుసుకుని వెంటనే అప్రమత్తమయ్యారు. సుమారు 100 మంది నిపుణులతో ఒక 'గ్లోబల్ వార్ రూమ్' ఏర్పాటు చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టారు. భద్రతా బృందాలు వేగంగా స్పందించి తదుపరి నష్టాన్ని అరికట్టగలిగాయి. "భద్రతపై మరింత ముందుగానే పెట్టుబడి పెట్టాల్సింది" అని యి హే అంగీకరిస్తూ, భవిష్యత్తులో పటిష్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.దొంగిలించబడిన టోకెన్లను తిరిగి రాబట్టే బదులుగా, బినాన్స్ తన సొంత నిధులైన సెక్యూర్ అసెట్ ఫండ్ ఫర్ యూజర్స్, ఫ్యూచర్స్ ఇన్సూరెన్స్ ఫండ్, కార్పొరేట్ ట్రెజరీల నుంచి సుమారు 6 బిలియన్ డాలర్లతో కొత్త టోకెన్లను కొనుగోలు చేసి వినియోగదారుల ఖాతాలలో జమ చేసింది. మిగిలిన 5 శాతం ఆస్తులు తక్కువ లిక్విడిటీ ఉన్నవి కావడంతో, వాటిని సమకూర్చడానికి కొంత సమయం పడుతుందని కంపెనీ వివరించింది. మొత్తం నష్టాన్ని భర్తీ చేయడానికి గాను సుమారు 6.34 బిలియన్ డాలర్లను కేటాయించినట్లు, వినియోగదారులపై ఎలాంటి భారం పడదని స్పష్టం చేసింది.నవంబర్ 1 నుంచి బిట్‌కాయిన్, ఈథర్, డాగీకాయిన్, టెథర్ వంటి ప్రధాన టోకెన్ల విత్‌డ్రాయల్స్‌ను దశలవారీగా పునఃప్రారంభించారు. ఆ తర్వాత వినియోగదారులు సుమారు 3.64 బిలియన్ డాలర్లను విత్‌డ్రా చేసుకున్నారు. ఇది బినాన్స్ నిర్వహణలో ఉన్న 171 బిలియన్ డాలర్ల ఆస్తులలో కేవలం 2.1 శాతం మాత్రమే. మరోవైపు, పరిశ్రమలోని ఇతర భాగస్వామ్య సంస్థలు దొంగిలించబడిన ఆస్తులలో దాదాపు 3 బిలియన్ డాలర్లను ఫ్రీజ్ చేయగలిగాయి.

యూపీఐ ఆల్ టైమ్ రికార్డ్.. రోజువారీ లావాదేవీలు లక్ష కోట్లు!


అక్టోబర్‌లో యూపీఐ లావాదేవీల సరికొత్త రికార్డ్

తొలిసారిగా రూ. లక్ష కోట్లు దాటిన రోజువారీ సగటు విలువ

నెల మొత్తం మీద రూ.31.53 లక్షల కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు

పండుగల సీజన్ అమ్మకాలతో భారీగా పెరిగిన డిజిటల్ చెల్లింపులు

ఎండీఆర్ ఛార్జీల అమలు వాయిదా నేపథ్యంలో పెరిగిన లావాదేవీలు



భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సరికొత్త చరిత్ర సృష్టించింది. అక్టోబర్ నెలలో తొలిసారిగా యూపీఐ ద్వారా జరిగిన సగటు రోజువారీ లావాదేవీల విలువ రూ.1 లక్ష కోట్లు దాటింది. పండుగల సీజన్‌లో వినియోగదారులు భారీగా కొనుగోళ్లు జరపడంతో డిజిటల్ చెల్లింపులు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి.నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విడుదల చేసిన డేటా ప్రకారం.. అక్టోబర్‌లో యూపీఐ ద్వారా మొత్తం రూ.31.53 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. నెలవారీ లావాదేవీల విలువ రూ.30 లక్షల కోట్ల మార్కును దాటడం ఇదే మొదటిసారి. ఇంతకుముందు 2026 మే నెలలో నమోదైన రూ.29.9 లక్షల కోట్లే అత్యధికం. లావాదేవీల సంఖ్య పరంగా చూస్తే, అక్టోబర్‌లో 25.47 బిలియన్ల ట్రాన్సాక్షన్లు జరిగాయి. అంటే రోజుకు సగటున 821 మిలియన్ల లావాదేవీలు నమోదయ్యాయి. సెప్టెంబర్ నెలలో రోజువారీ సగటు లావాదేవీల విలువ సుమారు రూ.98,000 కోట్లుగా ఉంది.ప్రస్తుత పండుగల సీజన్ అమ్మకాలే ఈ రికార్డు స్థాయి పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. దీనికి తోడు అక్టోబర్ నెలలో 31 రోజులు ఉండటం కూడా నెలవారీ లావాదేవీల సంఖ్య పెరగడానికి దోహదపడింది. ప్రస్తుతం దేశంలోని మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ వాటా సుమారు 89 శాతంగా ఉంది. దీంతో ఇది దేశంలోనే అత్యంత ఆధిపత్య చెల్లింపుల వేదికగా కొనసాగుతోంది.యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీలను ప్రవేశపెట్టాలని ప్రతిపాదనలు వస్తున్న తరుణంలో ఈ రికార్డు వృద్ధి నమోదు కావడం గమనార్హం. వాస్తవానికి ఈ ఛార్జీలను ఎన్‌పీసీఐ గత నెలలోనే అమలు చేయాలని భావించింది. అయితే, పండుగల సీజన్‌లో అమ్మకాలపై ప్రభావం పడుతుందని వ్యాపార సంఘాలు, ఫిన్‌టెక్ కంపెనీలు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి విజ్ఞప్తులు రావడంతో దీపావళి తర్వాత వరకు ఈ నిర్ణయాన్ని వాయిదా వేసింది. నవంబర్ రెండో వారంలో దీపావళి ఉండటంతో ఆ తర్వాతే ఎండీఆర్ ఛార్జీల అమలుపై స్పష్టత రానుంది.

పండుగ సీజన్‌లో కియా హవా

అక్టోబర్‌లో ఆల్ టైమ్ రికార్డ్ అమ్మకాలు!

మొత్తం 33,462 యూనిట్ల విక్రయంతో 13% పైగా వృద్ధి

ఈ ఏడాది తొలి 10 నెలల అమ్మకాలు ఇప్పటికే గత ఏడాది రికార్డును అధిగమించాయి

సెల్టోస్, సోనెట్, కారెన్స్ మోడళ్లకు వినియోగదారుల నుంచి భారీ స్పందన

పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, ఈవీ.. అన్ని విభాగాల్లోనూ బలమైన పనితీరు



ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ కియా ఇండియా అమ్మకాల్లో సరికొత్త శిఖరాలను అధిరోహించింది. 2026 అక్టోబర్ నెలలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 33,462 యూనిట్ల హోల్‌సేల్ అమ్మకాలను నమోదు చేసి సంచలనం సృష్టించింది. గతేడాది అక్టోబర్ (2025)లో విక్రయించిన 29,556 యూనిట్లతో పోలిస్తే ఇది 13.22% అధికం. వరుసగా రెండో నెల కూడా కియా రికార్డు స్థాయి అమ్మకాలను నమోదు చేయడం విశేషం. సెప్టెంబర్ 2026లో సాధించిన 32,017 యూనిట్ల రికార్డును అక్టోబర్‌లో అధిగమించింది.పండుగ సీజన్‌లో వినియోగదారుల నుంచి వచ్చిన బలమైన డిమాండ్ ఈ రికార్డు అమ్మకాలకు ప్రధాన కారణంగా నిలిచింది. ఈ ఏడాది (2026) జనవరి నుంచి అక్టోబర్ వరకు కియా మొత్తం 2,86,470 యూనిట్లను విక్రయించింది. గతేడాది (2025) మొత్తం విక్రయించిన 2,80,286 యూనిట్ల సంఖ్యను కేవలం 10 నెలల్లోనే అధిగమించడం కంపెనీ వృద్ధి వేగానికి నిదర్శనంగా నిలుస్తోంది.కియా అమ్మకాల్లో ఎస్‌యూవీలు సెల్టోస్, సోనెట్ కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా, అప్‌డేటెడ్ వెర్షన్ మార్కెట్లోకి వచ్చినప్పటి నుంచి సెల్టోస్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. జనవరి 2026 నుంచి ప్రతి నెలా సగటున 10,000 యూనిట్లకు పైగా అమ్ముడవుతున్న సెల్టోస్, ఒక్క అక్టోబర్‌లోనే 13,000 యూనిట్లకు పైగా విక్రయమైంది. కారెన్స్ (కారెన్స్ క్లావిస్‌తో కలిపి) శ్రేణి కూడా అమ్మకాలను గణనీయంగా పెంచింది. మొత్తం అమ్మకాల్లో దాదాపు 10% వాటాను సీఎన్‌జీ వేరియంట్లు దక్కించుకోవడం గమనార్హం.కొత్తగా మార్కెట్లోకి తెచ్చిన సొరెంటో ఎస్‌యూవీకి సైతం మంచి స్పందన లభిస్తోంది. హైబ్రిడ్, డీజిల్ ఆప్షన్లలో అందుబాటులో ఉన్న ఈ మోడల్ టెక్నాలజీ, ఫీచర్లు, మైలేజీ విషయంలో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. మరోవైపు, ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలోనూ కియా తన పట్టును నిరూపించుకుంది. అక్టోబర్‌లో అత్యధిక ఈవీ అమ్మకాలను నమోదు చేసింది. సిరోస్ ఈవీ, కారెన్స్ క్లావిస్ ఈవీ మోడళ్లు ఈ వృద్ధికి దోహదపడ్డాయి. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, హైబ్రిడ్, ఎలక్ట్రిక్.. ఇలా అన్ని పవర్‌ట్రెయిన్ విభాగాల్లోనూ వాహనాలను అందిస్తూ మార్కెట్‌లో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.ఈ రికార్డు స్థాయి ప్రదర్శనపై కియా ఇండియా సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ హర్షం వ్యక్తం చేశారు. "వినియోగదారుల నమ్మకం, పండుగ సీజన్ డిమాండ్, మా విజయవంతమైన మోడళ్లు, కొత్త ఆవిష్కరణలకు లభిస్తున్న సానుకూల స్పందనే ఈ విజయానికి కారణం. మా మల్టీ-పవర్‌ట్రెయిన్ వ్యూహం సత్ఫలితాలనిస్తోంది," అని ఆయన వివరించారు.

యాపిల్ నుంచి కొత్త ఐప్యాడ్ మినీ

సన్నని డిజైన్, సరికొత్త ఫీచర్లు!

టెక్ దిగ్గజం యాపిల్ అత్యాధునిక ఫీచర్లతో కూడిన నెక్స్ట్ జనరేషన్ 'ఐప్యాడ్ మినీ'ని సోమవారం ఆవిష్కరించింది. మునుపటి మోడల్స్ కంటే మరింత సన్నగా, తేలికగా ఉండేలా దీనిని రీడిజైన్ చేశారు. పెద్ద ఓఎల్ఈడీ డిస్‌ప్లే, శక్తిమంతమైన ఏ20 ప్రో చిప్, ఐప్యాడ్ ఓఎస్ 27తో కూడిన అధునాతన ఏఐ సామర్థ్యాలు దీని ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తున్నాయి.ఈ కొత్త ఐప్యాడ్ మినీలో 8.5 అంగుళాల సూపర్ రెటినా ఎక్స్‌డీఆర్ ఓఎల్ఈడీ డిస్‌ప్లేను అమర్చారు. అంచులు (బెజెల్స్) తగ్గించడం వల్ల పరికరం పరిమాణం పెరగకుండానే స్క్రీన్ వైశాల్యం పెరిగింది. ఇది మునుపటి మోడల్ కంటే రెట్టింపు బ్రైట్‌నెస్‌ను, మెరుగైన కాంట్రాస్ట్ రేషియోను అందిస్తుంది.డిజైన్ విషయానికొస్తే, కేవలం 5.4 మి.మీ. మందంతో యాపిల్ నుంచి వచ్చిన అత్యంత సన్నని మినీ టాబ్లెట్‌గా ఇది నిలిచింది. మిడ్‌నైట్, స్టార్‌లైట్ రంగుల్లో ఇది లభ్యం కానుంది. నీరు, ధూళి నుంచి రక్షణ కోసం దీనికి ఐపీ 67 రేటింగ్ కూడా ఇచ్చారు.పనితీరు పరంగా ఈ ఐప్యాడ్ మినీలో సరికొత్త ఏ20 ప్రో చిప్‌ను ఉపయోగించారు. ఇది 2 నానోమీటర్ టెక్నాలజీతో తయారైంది. దీనివల్ల సీపీయూ పనితీరు 60 శాతం, గ్రాఫిక్స్ వేగం 2.7 రెట్లు, ఏఐ ప్రాసెసింగ్ 4.5 రెట్లు మెరుగైనట్లు యాపిల్ వెల్లడించింది. ముఖ్యంగా 512 జీబీ మోడల్‌లో ప్రత్యేకంగా డ్యూయల్ 16-కోర్ న్యూరల్ ఇంజిన్‌ను కూడా పొందుపరిచారు. కనెక్టివిటీ కోసం కొత్త ఎన్ 1 వైర్‌లెస్ చిప్‌ను వాడారు. ఇది వై-ఫై 7, బ్లూటూత్ 6కు మద్దతు ఇస్తుంది.ఆడియో, కెమెరాల విషయంలోనూ పలు అప్‌గ్రేడ్లు చేశారు. డిస్‌ప్లేలోనే స్పీకర్లను అమర్చడం ద్వారా స్పష్టమైన ధ్వని అనుభూతిని అందించే 'అకౌస్టిక్ డిస్‌ప్లే సిస్టమ్'ను పరిచయం చేశారు. ముందువైపు ల్యాండ్‌స్కేప్ ఎడ్జ్‌లో 12 ఎంపీ సెంటర్ స్టేజ్ కెమెరా, వెనుకవైపు 4కే వీడియో రికార్డింగ్‌కు సపోర్ట్ చేసే 12 ఎంపీ వైడ్ కెమెరా ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ పరంగా, ఐప్యాడ్ ఓఎస్ 27తో వస్తున్న 'యాపిల్ ఇంటెలిజెన్స్', కొత్త సిరి ఏఐ ఫీచర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఉద్యోగులకు ఈపీఎఫ్‌వో గుడ్‌న్యూస్

పీఎఫ్ సేవలు ఇక మీ వాట్సాప్‌లోనే

వాట్సాప్‌లో పీఎఫ్ బ్యాలెన్స్ తెలుసుకునే సదుపాయం ప్రారంభం

చివరి ఐదు లావాదేవీల వివరాలూ అందుబాటులోకి

పీఎఫ్ పాస్‌బుక్ సమాచారాన్ని కూడా పొందే వీలు

రూ.1,000లోపు నిలిచిపోయిన ఖాతాలకు ఆటోమేటిక్ సెటిల్‌మెంట్

ఆధార్, బ్యాంకు వివరాల ధ్రువీకరణ తప్పనిసరి



ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) చందాదారులకు శుభవార్త. ఇకపై వాట్సాప్ ద్వారానే పీఎఫ్ ఖాతాలో ఎంత డబ్బు ఉందో తెలుసుకోవచ్చు. ఖాతాలో ఇటీవల జరిగిన ఐదు లావాదేవీల వివరాలను చూడటంతో పాటు పీఎఫ్ పాస్‌బుక్ సమాచారాన్ని కూడా పొందవచ్చు. ఈ కొత్త సదుపాయాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సేవలతో సాధారణ ఖాతా వివరాల కోసం ఈపీఎఫ్ కార్యాలయాలను సంప్రదించాల్సిన అవసరం తగ్గనుంది.ఈ సేవలను వినియోగించుకునేందుకు చందాదారులు ఈపీఎఫ్‌వో అధికారిక వాట్సాప్ సేవను మాత్రమే ఉపయోగించాలి. అందుబాటులో ఉన్న సేవల్లో పీఎఫ్ బ్యాలెన్స్ తెలుసుకోవడం, చివరి ఐదు లావాదేవీలను పరిశీలించడం, పాస్‌బుక్ వివరాలను పొందడం ఉన్నాయి. 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' (పీఎంవీబీఆర్‌వై)కు సంబంధించిన అవసరాలను పూర్తి చేసేందుకు వ్యక్తిగత మార్గదర్శకత్వం, సహాయం కూడా ఈ సేవ ద్వారా అందించనున్నారు.వాట్సాప్ సేవతో పాటు మరో కీలక నిర్ణయాన్ని ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ఆధార్ ధ్రువీకరణ పూర్తయిన, నిలిచిపోయిన పీఎఫ్ ఖాతాల్లో రూ.1,000 లేదా అంతకంటే తక్కువ మొత్తం ఉన్న అర్హులైన చందాదారులకు డబ్బు తిరిగి చెల్లించే ప్రక్రియను ఆటోమేటిక్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకోసం చందాదారులు ప్రత్యేకంగా క్లెయిమ్ దాఖలు చేయాల్సిన అవసరం ఉండదు. అయితే గుర్తింపు, బ్యాంకు ఖాతా వివరాల ధ్రువీకరణ పూర్తయ్యాకే ఈ ప్రక్రియ చేపడతారు. ఈ సదుపాయం ద్వారా సుమారు లక్ష ఖాతాలకు చెందిన రూ.5 కోట్ల వరకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా.

రెండేళ్లలో మార్కెట్‌లోకి 2000 కొత్త కంపెనీలు

సెబీ చైర్మన్ కీలక వ్యాఖ్యలు

అంచనా వేసిన సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే

లిస్టింగ్‌కు ముందు కంపెనీల పాలనా ప్రమాణాలు మెరుగుపడాలని సూచన

ఇటీవలి కాలంలో భారీగా పెరిగిన నిధుల సమీకరణ

ఇండిపెండెంట్ డైరెక్టర్ల పాత్రపై సెబీ కీలక కసరత్తు

భారత క్యాపిటల్ మార్కెట్లలోకి రాబోయే రెండేళ్లలో సుమారు 2000 కొత్త కంపెనీలు ప్రవేశించే అవకాశం ఉందని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చైర్మన్ తుహిన్ కాంత పాండే అంచనా వేశారు. భారత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న సానుకూల ధోరణి ఈ అంచనాలకు బలం చేకూరుస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో 189 కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయి, రూ. 98,038 కోట్లు సమీకరించాయి. గత ఏడాది ఇదే కాలంలో 186 కంపెనీలు కేవలం రూ. 71,085 కోట్లు మాత్రమే సేకరించాయి. ఇటీవలి జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ద్వారా రూ. 30,213 కోట్లు సమీకరించడం మార్కెట్ ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రిఫరెన్షియల్ ఇష్యూలు, క్యూఐపీలతో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 914 కంపెనీలు మొత్తం రూ. 3.15 లక్షల కోట్ల నిధులను సమీకరించాయి.దేశంలోని అనేక మధ్య శ్రేణి కంపెనీలకు ఈక్విటీ మార్కెట్ల ద్వారా నిధులు పొందే సామర్థ్యం ఉందని, అయితే లిస్టింగ్‌కు ముందు ఆర్థిక నివేదికల నాణ్యత, కార్పొరేట్ పాలన వంటి అంశాలను మెరుగుపరచుకోవాలని పాండే సూచించారు. ఈ దిశగా అర్హత ఉన్న కంపెనీలకు అవసరమైన తోడ్పాటును అందించాలని సీఐఐ, ఫిక్కీ వంటి పారిశ్రామిక సంస్థలను సెబీ కోరినట్లు ఆయన తెలిపారు. ఇండిపెండెంట్ డైరెక్టర్ల పాత్రపై కూడా సెబీ ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం నిబంధనల పాటింపునకే పరిమితం కాకుండా, మైనారిటీ ఇన్వెస్టర్లతో సహా వాటాదారులందరి ప్రయోజనాలను కాపాడటంలో వారు క్రియాశీలక పాత్ర పోషించాలని పాండే స్పష్టం చేశారు. సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సుస్థిరత వంటి ఆధునిక అంశాలపై కూడా వారు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం బీఎస్ఈలో సుమారు 5,300 కంపెనీలు నమోదై ఉన్నాయి.

పండగ బోనస్ వచ్చిందా? తొందరపడి ఖర్చు చేయకుండా ఈ 5 పనులు పూర్తి చేయండి!

బోనస్‌తో అధిక వడ్డీ అప్పులు తీర్చుకుంటే మేలు

3 నుంచి 6 నెలల ఖర్చులకు అత్యవసర నిధి ఏర్పాటు చేసుకునే వీలు

దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టొచ్చు

భవిష్యత్తు అవసరాలకు కొంత మొత్తం పాడుపు చేయాలంటున్న నిపుణులు

ఆర్థిక పరిస్థితిని బట్టి బోనస్ వినియోగంపై నిర్ణయం తీసుకుంటే మేలు



దీపావళి పండగ సందర్భంగా చేతికి అందిన బోనస్‌తో కొత్త వస్తువులు కొనాలనిపించడం సహజం. కొత్త ఫోన్, దుస్తులు, ఇంటి అవసరాల కోసం ఆ డబ్బును ఖర్చు చేయాలని చాలామంది భావిస్తారు. అయితే వచ్చిన మొత్తాన్ని పూర్తిగా ఖర్చు చేసేస్తే భవిష్యత్తు అవసరాలకు ఇబ్బంది ఎదురుకావచ్చు. కాస్త ప్రణాళికతో వ్యవహరిస్తే ఈ అదనపు ఆదాయాన్ని ఆర్థిక భద్రతకు ఉపయోగించుకోవచ్చు. న్యూస్ 18 కథనం ప్రకారం బోనస్‌ను సద్వినియోగం చేసుకోవడానికి ఐదు మార్గాలు ఉన్నాయి.క్రెడిట్ కార్డు బకాయిలు, అధిక వడ్డీతో తీసుకున్న వ్యక్తిగత రుణాలు ఉంటే ముందుగా వాటిని తగ్గించుకునేందుకు బోనస్‌లో కొంత మొత్తం కేటాయించండి. దీనివల్ల భవిష్యత్తులో చెల్లించాల్సిన వడ్డీ భారం తగ్గుతుంది.ఉద్యోగం కోల్పోవడం, అనుకోని వైద్య ఖర్చులు, ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురుకావచ్చు. కనీసం మూడు నుంచి ఆరు నెలల కుటుంబ ఖర్చులకు సరిపడా మొత్తాన్ని అత్యవసర నిధిగా ఉంచుకోవాలి. బోనస్‌తో ఈ నిధిని ప్రారంభించవచ్చు లేదా ఇప్పటికే ఉన్న మొత్తాన్ని పెంచుకోవచ్చు.దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం బోనస్‌లో కొంత మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్లు, ఈక్విటీలు వంటి పెట్టుబడి సాధనాల్లో పెట్టవచ్చు. అయితే వీటిలో మార్కెట్ రిస్క్ ఉంటుందని గుర్తుంచుకోవాలి. పెట్టుబడి పెట్టే ముందు లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యాన్ని అంచనా వేయాలి.త్వరలో ఇల్లు కొనడం, పిల్లల చదువులు, ఇతర ముఖ్యమైన ఖర్చులు ఉంటే అందుకు కొంత మొత్తాన్ని కేటాయించండి. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి సాధనాలను పరిశీలించవచ్చు. డబ్బు ఎప్పుడు అవసరమవుతుందో బట్టి సరైన పొదుపు మార్గాన్ని ఎంచుకోవాలి.బోనస్ వచ్చిందని ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేయకూడదు. పండగ కొనుగోళ్లు, బహుమతులు, వ్యక్తిగత అవసరాల కోసం ముందుగానే కొంత మొత్తం నిర్ణయించుకోవాలి. మిగిలిన డబ్బును పొదుపు, అప్పుల చెల్లింపు, పెట్టుబడులకు మళ్లించాలి.



‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్ ట్రైలర్ అప్‌డేట్..
వచ్చేస్తోన్న మ్యాడ్ గ్యాంగ్!

టాలీవుడ్ యువతను ఊపేసిన కల్ట్ హిట్ సినిమా ఈ నగరానికి ఏమైందికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం ‘ఈఎన్ఈ రీపీట్’ టాలెంట్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5:00 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీకాంత్ మగంటి, వెంకటేష్ కాకుమాను తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. కాగా, ఈ పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్ సినిమా నవంబర్ 19, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

మ్యూజిక్ డైరెక్టర్‌పై క్లారిటీ..
అనిరుధ్, జీవీ ప్రకాష్‌లకు నో ఛాన్స్, బాలయ్య సినిమా అప్‌డేట్ ఇదే!



నందమూరి నటసింహం బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం చీదీఖ 112పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య మాస్ ఇమేజ్‌కు కొరటాల శివ మార్క్ కథనం తోడైతే థియేటర్లలో అభిమానులకు పండగే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను ఘనంగా ప్రారంభించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సంగీత దర్శకుడి ఎంపికపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. చీదీఖ 112కు సంగీతం అందించబోయే దర్శకుడు ఎవరనే విషయంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తొలుత తమిళ స్టార్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ ప్రాజెక్ట్‌కు పనిచేయబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఆ తర్వాత అనిరుధ్ స్థానంలో మరో ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్‌ను తీసుకున్నారంటూ వార్తలు వచ్చాయి. దీంతో బాలయ్య సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం అందించబోతున్నారని అభిమానులు భావించారు. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో మ్యూజిక్ డైరెక్టర్ ఎంపికపై ఆసక్తి మరింత పెరిగింది. సంగీత దర్శకుడి ఎంపికపై వస్తున్న వరుస ప్రచారాలకు చిత్ర బృందం తాజాగా స్పందించింది. అనిరుధ్ రవిచందర్, జీవీ ప్రకాష్ కుమార్‌లలో ఎవరినీ ఇప్పటివరకు అధికారికంగా ఖరారు చేయలేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం పలువురు సంగీత దర్శకులతో చర్చలు జరుగుతున్నప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు.



పా. రంజిత్ ‘వేట్టువం’ రిలీజ్ డేట్ ఫిక్స్..
సంక్రాంతి 2027 బరిలో భారీ యాక్షన్ ఎపిక్!

సరికొత్త కథాంశాలతో సినిమాలను తెరకెక్కిస్తూ టాలీవుడ్, కోలీవుడ్‌లలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ ప్రాజెక్ట్ ‘వేట్టువం’ విడుదలకు సంబంధించిన అఫిషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. ప్రతిష్టాత్మకమైన సంక్రాంతి 2027 కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ అండ్ టీజర్ ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇది ఒక ఇంటెన్స్ పోస్ట్-అపొకలిప్టిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. హాలీవుడ్ కల్ట్ క్లాసిక్ మూవీ ‘మ్యాడ్ మాక్స్: ఫ్యూరీ రోడ్’ తరహా వైబ్స్ మరియు ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. భూమి విధ్వంసం, కార్పొరేట్ సిండికేట్లు మరియు ప్రాచీన సంస్కృతికి మధ్య జరిగే పోరాట నేపథ్యంలో ఈ కథ సాగనుంది. ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో ఆర్య హీరోగా నటిస్తుండగా, శోభిత ధూళిపాళ వి.ఆర్. దినేష్ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరితో పాటు కలైయరసన్, గురు సోమసుందరం, జాన్ విజయ్, షాబీర్ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నీలం ప్రొడక్షన్స్ మరియు లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నారు.

రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ప్రారంభోత్సవానికి వేళాయె.. ఆసక్తికర పోస్ట్ పెట్టిన దర్శకుడి భార్య!



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న భారీ చిత్రం కోసం మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ‘రంగస్థలం’ వంటి సంచలన విజయం తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. రేపు ఈ చిత్రం ఘనంగా ప్రారంభం కానుండగా, అంతకంటే ముందే సుకుమార్ భార్య తబితా సుకుమార్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది.తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తబితా సుకుమార్ ఈ సినిమా గురించి భావోద్వేగపూరితంగా స్పందించారు. సుకుమార్ భార్యగా ఈ ప్రాజెక్ట్ తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సినిమా రచన కోసం సుకుమార్ ఎంత కష్టపడ్డారో, ఎన్ని గంటలు శ్రమించారో తనకు తెలుసని తెలిపారు. ఆయన పెట్టిన కష్టం, అభిరుచి, అంకితభావం ఇప్పుడు తెరపైకి రాబోతుండటం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని ఆమె వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుకుమార్ ఎంతో సమయం కేటాయించి కథపై పనిచేశారని తబితా తన పోస్ట్‌లో వివరించారు. ఆయన రచనలో చూపించిన శ్రమ, పట్టుదల తనకు తెలుసని చెబుతూ.. ఆ కష్టం ఒక రూపం దాల్చడం చూడటం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అంతేకాదు, ఎంతో అభిమానాన్ని సంపాదించుకున్న రామ్ చరణ్ -- సుకుమార్ కలయిక రెండోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయని తెలిపారు. తబితా పెట్టిన ఈ పోస్ట్ మెగా అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా సుకుమార్ కథ కోసం ఇంతగా కష్టపడ్డారనే విషయం అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి రకరకాల వార్తలు ప్రచారంలో ఉండగా, తాజాగా దర్శకుడి భార్య చేసిన వ్యాఖ్యలు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఈ సినిమా ప్రారంభోత్సవం రేపు ఘనంగా జరగనుంది. ఈ వేడుకతో ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా సినిమా ఏ తరహా కథతో తెరకెక్కనుంది? ఇందులో రామ్ చరణ్ పాత్ర ఎలా ఉండబోతోంది? అనే ప్రశ్నలకు కొంత స్పష్టత రావచ్చని అభిమానులు ఆశిస్తున్నారు. ‘రంగస్థలం’లో రామ్ చరణ్‌ను పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించి సుకుమార్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ జతకట్టడంతో ఈసారి ఎలాంటి కథను ఎంచుకున్నారనే ఆసక్తి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు రేపటి వేడుకలో వెల్లడయ్యే అవకాశముంది.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040